Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018


# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 323 పేజీలు 8 వెల : 5 శనివారం 23 మే 2026



## తిరుమలలో భక్తుల రద్దీ

అభిషేకసేవలో సామాన్యులకు దర్శనం



పదేపదే కొందరికే రిజర్వేషన్లు

## ఇస్తే ఎలా

మిగతా వారికి కూడా ఈప్రయోజనం అందవద్దా

కొందరికే రిజర్వేషన్లు దక్కితే మిగతా ప్రజలు ఏం కాను

ఇలా అయితే దేశంలో రిజర్వేషన్ల నుంచి బయటపడేనా

ఐఎఎస్ తల్లిదండ్రుల పిల్లలకు రిజర్వేషన్లు అవసరమా

సుప్రీం ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు



## మలేషియాలో 6న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

ముఖ్య అతిథిగా హాజరు కానున్న కెటిఆర్

బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి



# ఆస్కార్ స్థాయి నటుడు జగన్

తల్లిని, చెల్లిని గెంటేసిన మహానుభావుడు రాజకీయం కోసం కుట్రలు, నాటకాలు అలవాటు మంత్రి లోకేశ్ ఘాటు విమర్శలు

అమరావతి: మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అద్భుత నటుడని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. సినిమాల్లో నటిస్తే జగన్‌కు కచ్చితంగా ఆస్కార్ అవార్డ్ వస్తుందని ఎద్దేవా చేశారు. ఆస్తి కోసం సొంత తల్లి, చెల్లిని బయటకు గెంటేశారని.. ఇంకో చెల్లి తండ్రిని చంపి అన్యాయం చేశారంటూ మంత్రి ఆరోపించారు. సొంత జిల్లా ప్రజలను మోసం చేశారని.. సొంత బాబాయిని లేపేసి నెపం టీడీపీపై నెట్టారని మండిపడ్డారు. వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో లోకేశ్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. వైఎస్ వివేకాది గుండెపోటు కాదని.. గొడ్డలి పోటు అంటూ ఆరోపణలు గుప్పించారు. గతంలో జగన్ కోడికత్తి, గులకరాయి డ్రామాలు చూశామని.. మొన్న కడపలోనూ అలాంటి కుట్రే జరిగిందన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూశారని.. తప్పు చేసిన ఎవరినీ వదిలిపెట్టేది లేదని మంత్రి లోకేశ్ హెచ్చరించారు. రప్పా, రప్పా అంటే భయపడేవారు ఎవరూ లేరని.. మీ నాయకుడిని, వారి తండ్రినీ చూశామని వైసీపీ కార్యకర్తలకు చురకలు అంటించారు. ప్పా, రప్పాకు ఎండ్ కార్డ్ వేసే బాధ్యత తనదంటూ మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు. రెడ్ బుక్ అంటేనే భయపడుతున్నారని.. చివరకు ఎర్ర కారు చూసినా బెదిరిపోతున్నారని వైసీపీ నేతలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జగన్ రెడ్డి వారంలో ఒక రోజు మాత్రమే ఏపీలో ఉంటున్నారని.. మూడు రోజులు బెంగళూరులో, మరో మూడు రోజులు హైదరాబాద్‌లో ఉంటున్నారని లోకేశ్ తెలిపారు. జగన్‌కు సీసీడీ (క్రెడిట్ చోరీ డిజార్డర్) వ్యాధి ఉందని.. వైసీపీ కుట్రలపై అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సందర్భంగా గండికోట నిర్వాసితులకు న్యాయం చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో జమ్మలమడుగుకు అనేక పరిశ్రమలు

వస్తాయని తెలిపారు. రాయలసీమ స్టీల్ ఎ÷-లాంట్‌ను 2029 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కష్టకాలంలో పసుపుజెండాకు అండగా నిలబడిన వ్యక్తి భూపేశ్ రెడ్డి అని మంత్రి ప్రశంసించారు. ఆయనకు మాటలు తక్కువ.. చేతలు ఎక్కువని కొనియాడారు. జమ్మలమడుగు జోష్ అదిరిపోయిందని.. గండికోటను, టీడీపీని ఎవరూ టచ్ చేయలేరని మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు.



# నీచ రాజకీయాలు జగన్‌కు అలవాటే

తండ్రి శవం ఉండానే సిఎం కోసం పైరవీ

ఐదేళ్ల పాలనలో ఎపిని భ్రష్టు పట్టించిన ఘనుడు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శలు



## 2.5 కోట్ల విత్తన బంతుల పంపిణీ



### అటవీశాఖకు టార్గెట్ విధించిన డిప్యూటి సిఎం

ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖపై పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ నెలలో నిర్వహించనున్న విత్తన బంతుల (సీడ్ బాల్స్) తయారీ కార్యక్రమంపై అధికారులకు ఆయన దిశానిర్దేశర చేశారు.



జూలై నుంచే అందుబాటులోకి

## భోగాపురం

అక్కడి నుంచే విమాన సర్వీసుల రాకపోకలు

## ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ వ్యాపారం

బిఆర్ఎస్ రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తాం

మాజీమంత్రి హరీష్ రావు హెచ్చరిక

డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని చట్టంలో ఉందని వెల్లడించారు. ఫార్మా సిటీని కొనసాగిస్తామని ఓ వైపు కోర్టుకు చెబుతూ.. రేవంత్ ప్రభుత్వం జిమ్మిక్కు చేస్తోందని విమర్శించారు. ఫార్మా సిటీ వస్తే దానికి అనుబంధంగా కనీస సౌకర్యాలు ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలని ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.



## డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్‌లో రోల్ మోడల్‌గా తెలంగాణ...

డిజిటల్ పేమెంట్స్ నుంచి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్టక్చర్ వరకు... మనం సాధిస్తున్న పరివర్తనను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోందన్నారు.




పౌర సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా 'కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్'

ఇన్నోవేషన్స్, టాలెంట్, ఎకనామిక్ గ్రోత్ ను అనుసంధానించేలా 'ఎకో సిస్టం'

'డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ ఫైనాన్స్ సమ్మిట్ 2026'లో మంత్రి శ్రీధర్ బాబు



## సచివాలయం వద్ద ధర్నా.. కవిత అరెస్ట్

హైదరాబాద్: ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తెలంగాణ [illegible] సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సచివాలయం వద్ద ధర్నా చేశారు. వరి ధాన్యం రోడ్డుపై పోసి నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను చిన్న చూపు చూస్తోందని.. అన్నదాతలను అరిగోసలు పెడుతోందని ఆరోపించారు. తెలంగాణ రైతుల గోస ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి తెలియాలనే సచివాలయం ఎదుట ధర్నా చేపట్టినట్లు తెలిపారు. రెండున్నర ఏళ్లలో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా సమీక్ష చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో కల్లాల్లో ఉన్న ధాన్యంతో పాటు జొన్నలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కవితతోపాటు ఆ పార్టీ కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు ఫలక్‌నుమా పీఎస్‌కు తరలించారు.



# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతం

దేశ సగటు కంటే వేగంగా వృద్ధి రేటు

పట్టణీకరణతో సేవల రంగానికి భారీ అవకాశాలు

విద్యార్థుల రుణాలు భవిష్యత్ పెట్టుబడులు

రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు వడ్డీ లేని రుణాలు

బ్యాంకర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయంగా చెప్పారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు మరియు అనుబంధ రంగాలకు కిసాన్ క్రెడిట్ కార్డు సహా వివిధ పథకాల ద్వారా బ్యాంకులు అందిస్తున్న మద్దతు అభినందనీయం అని చెప్పారు.



24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల

## షెడ్యూల్ విడుదల

జూన్ 1న నోటిఫికేషన్, నామినేషన్ల దాఖలుకు జూన్ 8 చివరి తేదీ. 9న నామినేషన్ల పరిశీలన. నామినేషన్ల ఉపసంహరణకు జూన్ 11 వరకు గడువు తేదీగా ఈసీ ప్రకటించింది.

# పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా

న్యూఢిల్లీ: రిజర్వేషన్లపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది.దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమిలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్



బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చుని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన 'క్రీమిలేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్ని' కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమిలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో పాటు.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక, ఈ కేసులో సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వానికి, ఇతర
సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# మలేషియాలో 6న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

హైదరాబాద్:మలేషియా తెలంగాణ అసోసియేషన్, బీఆర్ఎస్ మలేషియా సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 6 న కౌలాలంపూర్‌లో జరిగే తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీ రామారావు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమ బ్రోచర్‌ను మాజీ మంత్రి ,ఎమ్మెల్యే జి .జగదీశ్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా కేసీఆర్ పేరును గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ లేని లోటు రెండున్నర ఏండ్లుగా కనిపిస్తుందని వెల్లడించారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయలేక పోతుందని, కేసీఆర్ ఇచ్చిన పథకాలనూ ఇవ్వలేక పోతుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోయామని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. అమెరికా దేశ చరిత్రలోనే కనివిని ఎరుగని రీతిలో గతంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు డల్లాస్‌లో జరిగాయని వివరించారు. దేశంలో బీజేపీ పాలనలో చిన్న పిల్లలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలపై అఘాయిత్యాలు చేస్తున్న నిందితులను పట్టుకునే శక్తి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. ఖరీఫ్ సీజన్ త్వరంలో ప్రారంభమవుతుందని, రైతులకు విత్తనాలు ,ఎరువులు ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని అన్నారు. రేవంత్ రెడ్డి పాత గురువు, చీకటి గురువు చెప్పినట్లు రైతులను వ్యవసాయానికి దూరం చేస్తున్నారని మండిపడ్డారు .రైతాంగాన్ని ముంచి వ్యవసాయ సబ్సిడీలు దోచుకోవాలనే ఆలోచన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదని అన్నారు.ప్రపంచ వ్యాప్తంగా ఏం జరిగిన ట్వీట్ చేసే రాహుల్ గాంధీ తెలంగాణలో మైనర్ బాలిక ఘటన పై ఎందుకు ట్వీట్ చేయ లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీనే తెలంగాణ ప్రజలకు , మహిళలకు శ్రీరామ రక్ష అని అన్నారు .ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ ప్రెసిడెంట్ మహేష్ బిగాల, మైటా ప్రెసిడెంట్ తిరుపతి,ఉమెన్స్ వింగ్ సుప్రియ, బీఆర్ఎస్ మలేసియా ప్రెసిడెంట్ చిట్టీ బాబు, శివ, రాష్ట్ర నాయకులు నరసింహ రెడ్డి, నంద్యాల దయాకర్ రెడ్డి, ధర్మేందర్ రెడ్డి, పడాల సతీష్, రవి యాదవ్ పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ వ్యాపారం

హైదరాబాద్: బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న మాజీ మంత్రి.. కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీకి మాత్రమే కేంద్ర పర్యావరణశాఖ అనుమతి ఇచ్చిందని తెలిపారు. డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని చట్టంలో ఉందని వెల్లడించారు. ఫార్మా సిటీని కొనసాగిస్తామని ఓ వైపు కోర్టుకు చెబుతూ.. రేవంత్ ప్రభుత్వం జిమ్మిక్కు చేస్తోందని విమర్శించారు. ఫార్మా సిటీ వస్తే దానికి అనుబంధంగా కనీస సౌకర్యాలు ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలని ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. 75శాతం ఫార్మా సిటీ ఉండి... మిగతా 25శాతం మిగతావి ఉండాలని అన్నారు. కానీ..75శాతం మిగతా వ్యాపారం చేసి.. కేవలం 25శాతమే ఫార్మా వచ్చేలా చేస్తున్నారని విమర్శించారు. ఇది చట్ట ప్రకారం చెల్లదన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని మాజీ మంత్రి ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని.. ఫార్మా సిటీని రీస్టోర్ చేస్తామని స్పష్టం చేశారు. 'ఇది నా మాట కాదు.. పార్లమెంట్ చట్టం. ఫార్మా సిటీ వస్తే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని మేము ప్రారంభించాం. మన దగ్గర నుంచి ఒక్క ఫార్మా కంపెనీ బయటికి వెళ్లొద్దని చేశాం. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోయింది. లాస్ట్ వన్ ఇయర్ ఎలక్షన్ ఉంటుంది. రేవంత్ సర్కార్ ఏమీ చేయలేదు. భూములు పంచి పెడితే బ్యాక్ ఎండ్ ఏదో లబ్ది పొందాలని ఎ÷-÷-లాన్ చేశారు. ఫార్మా సిటీ అభివృద్ధి చెందితే బీఆర్ఎస్‌కు పేరు వస్తుందని ఇలా చేశారు. ఉన్నది ఉన్నట్టుగా అక్కడ ఫార్మా సిటీనే వస్తుంది' అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

హైదరాబాద్: సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతలను ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం మహాత్మాజ్యోతి రావు పూలే ప్రజాభవన్ లో జరిగిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ బ్యాంకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్,  ÷నాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా,  ÷నాన్స్ - ఎ÷-లానింగ్ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్, ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ చిన్మయ మోహన్, ఎస్బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 20147 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని డిప్యూటీ సీఎం స్పష్టంగా చెప్పారు. రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు చేరుకోవడం, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమని చెప్పారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం అద్వితీయ విషయని ఆయన చెప్పారు. వ్యవసాయ రుణాల విషయంలో లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయంగా చెప్పారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు మరియు అనుబంధ రంగాలకు కిసాన్ క్రెడిట్ కార్డు సహా వివిధ పథకాల ద్వారా బ్యాంకులు అందిస్తున్న మద్దతు అభినందనీయం అని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటని డిప్యూటీ సీఎం చెప్పారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత



దృష్టి పెట్టాలని అన్నారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో బ్యాంకులు మరింత సానుకూల దృక్పథంతో ముందుకు రావాలని ఆయన చెప్పారు. విద్యార్థులకు ఇచ్చే రుణాలు యువతపై మనం పెట్టే భవిష్యత్ పెట్టుబడి అని ఆయన చెప్పారు. సంక్షేమం-అభివృద్ధి రెండింటిని జోడెడ్లుగా పరుగులు తీయగలవని ప్రజాప్రభుత్వం చేతల్లో నిరూపించిందని అన్నారు. సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఉపాధి సృష్టి పట్ల మా ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి ఆయన పునరుద్ఘాటించారు. నేడు ప్రపంచమంతా పునరుత్పాదక ఇంధనరంగంపై దృష్టి సారిస్తోందన్నారు. అందులో భాగంగా ప్రజాప్రభుత్వం కూడా సౌరశక్తి విభాగంలోస్థిరమైన ప్రగతిని సాధిస్తోందన్నారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మరియు ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. సామాజిక భద్రత,
బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలన్నారు. బ్యాంకులు కేవలం డబ్బు డిపాజిట్ చేసే, రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలుగానే కాకుండా, రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజల డబ్బు అంతా బ్యాంకులకే చేరుతుంది, కాబట్టి ఆ నిధులను ఏ రంగాల అభివృద్ధికి రుణాలుగా ఇస్తున్నామనేది చాలా ముఖ్యం. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి, ఉపాధికి ఏ రంగం ఎక్కువ దోహదపడుతుందో ఆలోచించి బ్యాంకులు వ్యూహాత్మకంగా రుణాలు అందించాలన్నారు.
ప్రజాప్రభుత్వం 2047 ఆర్థిక సంవత్సరం నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పెద్ద కల. తెలంగాణ ప్రస్తుత వృద్ధి రేటు చూస్తుంటే ఇది ఖచ్చితంగా సాధ్యమేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ సగటు వృద్ధి రేటు 8.2? గా ఉంటే, తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతంతో దూసుకుపోతోందని చెప్పారు. దేశ సగటు తలసరి ఆదాయం ?2.1 లక్షలుగా ఉంటే, తెలంగాణ తలసరి ఆదాయం ?4.18 లక్షలతో దేశంలోనే అగ్రగామిగా ఉందని ఉప ముఖ్యమంత్రి గర్వంగా ప్రకటించారు. తెలంగాణ ప్రజాప్రభుత్వం మూసీ నది పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం అత్యంత వేగంగా పూర్తి చేయడంకూడా ప్,ధాన లక్ష్యాలుగా నిర్దేశిరచుకుని ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో వేగంగా పట్టణీకరణ జరుగుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో సేవల రంగాని అధిక అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు. హిళా ఆర్థిక సాధికారత కోసం రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుతున్నట్లు ఈ సందర్భంగా చెప్పారు. ఈ సంవత్సరం హైదరాబాద్ నగరంలో మహిళా సంఘాలకు రుణ పంపిణీ యుద్ధప్రాతిపదికన దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాద్ నగరం మహిళలకు వ్యాపార రంగంలో, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల్లో ఎదగడానికి ఎన్నో అవకాశాలను ఇస్తోందని చెప్పారు. నగరంలోని మురికివాడల్లోని యువ మహిళా పారిశ్రామికవేత్తలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో త్వరలోనే అనేక ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లను తీసుకువస్తున్నట్లు ద
ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా ఫార్మా, ఫ్యాబ్ సిటీ, స్టీల్, లెదర్, టెక్స్‌టైల్ వంటి వివిధ రంగాలను డిజైన్ చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.

# డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ లో రోల్ మోడల్ గా తెలంగాణ...

హైదరాబాద్:డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా... ప్రభుత్వ పౌర సేవల్ని మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా ప్రజల ముంగిటకే చేర్చేలా ఒక ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. దిఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఆధ్వర్యంలో శుక్రవారం నోవాటెల్ హెచ్ఐసీసీలో నిర్వహించిన 'డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్  ÷నాన్స్ సమ్మిట్ 2026'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ప్రస్తుతం గ్లోబల్ ఎకానమీ ఊహించని వేగంతో డిజిటల్ వైపు దూసుకుపోతోందని, సంప్రదాయ పద్ధతుల స్థానంలో వ్యవస్థను రీ-డ్గి÷న్ చేసే సరికొత్త డిజిటల్ ఈక్వేషన్స్ తెరపైకి వచ్చాయన్నారు. ఈ గ్లోబల్ డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కు అనుగుణంగా మార్పుల్ని అందిపుచ్చుకునే దేశాలకే భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రపంచం లోనే అతిపెద్ద డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందన్నారు. డిజిటల్ పేమెంట్స్ నుంచి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వరకు... మనం సాధిస్తున్న పరివర్తనను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోందన్నారు. ఈ గ్లోబల్ డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ లో భారత్ సాధిస్తున్న ప్రగతికి తెలంగాణ ఒక గ్రోత్ ఇంజన్ లా మారిందన్నారు. భావితరాల అవసరాలకు అనుగుణంగా నెక్ట్స్ జనరేషన్ ఇన్నోవేషన్స్, టాలెంట్, ఎకనామిక్ గ్రోత్.. ఈ మూడింటినీ నడిపించే ఒక బలమైన ఎకోసిస్టంను ఇప్పటి నుంచే అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో మన వాటాను10 శాతానికి చేర్చాలనే సంకల్పంతో ముందుకెళు
్నామన్నారు. ఒకప్పుడు కేవలం సంప్రదాయ బుక్ కీపింగ్, అకౌంట్స్ ఆడిటింగ్‌కే పరిమితమైన సీఏలు.. నేడు కార్పొరేట్ సంస్థలకు 'స్ట్రాటజిక్ బిజినెస్ అడ్వైజర్స్'గా రూపాంతరం చెందారన్నారు. ఏఐ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీస్ వల్ల  ÷నాన్స్ రంగంలో సరికొత్త అవకాశాలు... అదే స్థాయిలో సైబర్ మోసాలు, డీప్‌ఫేక్స్, సైబర్ అరెస్ట్, క్రిఎ÷-టో ఫ్రాడ్స్ తదితర సవాళ్లు కూడా తెరపైకి వచ్చాయన్నారు. ఇలాంటి తరుణంలో సీఏలు కేవలం  ÷నాన్షియల్ ఆడిటింగ్‌కే పరిమితం కాకుండా... 'సైబర్ అష్యూరెన్స్'కూ ప్రాధాన్యమివ్వాల్సిన అవసరముందన్నారు. మారుతున్న ట్రెండ్స్ కు స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్ పై దృష్టి సారించాలని సూచించారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఅండ్ఏజీ ఆనంద్
మోహన్ బజాజ్, సెర్ట్ ? ఇన్ జాయింట్ డైరెక్టర్ అభిషేక్ సోలంకి, ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ ఇన్ కం ట్యాక్స్ ఇన్వెస్టిగేషన్ రాజగోపాల్ శర్మ, సెబీ సీజీఎం సాహిల్ మాలిక్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ హర్షవర్ధన్, ఆర్బీఐ సీజీఎం శైలజా రాణి జంపాల, ఎన్ ఎస్ ఈ సీఐఎస్వో రాజేష్ థాపర్, డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సీఈవో వినాయక్ గాడ్సే తదితరులు పాల్గొన్నారు.

# 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల

జూన్, జులైలో 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో పది రాష్ట్రాల్లోని 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. జూన్ 18న రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఈసీ తెలిపింది. జూన్ 1న నోటిఫికేషన్, నామినేషన్ల దాఖలుకు జూన్ 8 చివరి తేదీ. 9న నామినేషన్ల పరిశీలన. నామినేషన్ల ఉపసంహరణకు జూన్ 11 వరకు గడువు తేదీగా ఈసీ ప్రకటించింది. ఎన్నికలు ముగిసిన రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరగనుంది. జూన్ 20 కల్లా ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.
ఏపీలో నాలుగు స్థానాలకు..
ఏపీ నుంచి ప్రస్తుతం రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, సానా సతీష్‌ల పదవీ కాలం జూన్ 26న ముగియనుంది. దీంతో ఏపీలోని నాలుగు స్థానాలకు జూన్ 18న ఎన్నికలు జరగనున్నాయి.

# తిరుమలలో భక్తుల రద్దీ



అభిషేకసేవలో సామాన్యులకు దర్శనం

తిరుమల: తిరుమలలో రద్దీ కారణంగా సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇచ్చేందుకు టైం మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించినట్లు అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. గురువారం రికార్డు స్థాయిలో 79 వేల మంది భక్తులకు దర్శన భాగ్యం కల్పించినట్లు ఆయన చెప్పారు. శుక్రవారం అభిషేక సేవ సమయంలో సామాన్య భక్తులను దర్శనానికి అనుమతించామన్నారు. అభిషేక సేవ సమయంలో 5850 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా తితిదే కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీవారి అభిషేక సేవ సమయంలో సామాన్య భక్తులను శ్రీవారి దర్శనానికి అనుమతించింది. గతేడాది వేసవిలోనూ అభిషేక సమయంలో భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించింది.

# జూలై నుంచే అందుబాటులోకి భోగాపురం

**అక్కడి నుంచే విమాన సర్వీసుల రాకపోకలు**

అమరావతి: జులై 8వ తేదీ నుంచి భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం అందుబాటులోకి రానుంది. జులై 5వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. జులై 8వ తేదీ నుంచి తమ విమానాలన్నీ భోగాపురం నుంచే నడుస్తాయని పలు విమానయాన సంస్థలు ఇప్పటికే ప్రకటించాయి. జులై 8వ తేదీ నుంచి అల్లూరి సీతారామరాజు విమానాశ్రయానికి రావాలని ఇప్పటికే తమ ప్రయాణికులకు సర్క్యులర్లు జారీ చేశాయి. 2026 జూలై 8వ తేదీ నుంచి స్కూట్ ఎయిర్‌లైన్స్‌కు సంబంధించిన అన్ని విమానాలు విశాఖపట్నం విమానాశ్రయం నుంచి కాకుండా.. కొత్తగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నడుస్తాయని స్కూట్ ఎయిర్‌లైన్స్ సర్క్యులర్ జారీ చేసింది. విమానాశ్రయం మారినప్పటికీ, ఎయిర్‌పోర్ట్ కోడ్ '÷జి' గానే కొనసాగుతుందని తెలిపింది. చెక్-ఇన్ కౌంటర్లు, స్కూట్ ఎయిర్‌లైన్స్ కౌంటర్లు కొత్త విమానాశ్రయంలోని టెర్మినల్ 1 లోపల



ఉంటాయని విమానయాన సంస్థ వెల్లడించింది. విమానం బయలుదేరే సమయానికి 2.5 గంటల (150 నిమిషాలు) ముందే చెక్-ఇన్ కౌంటర్లు తెరవబడతాయని తెలిపింది. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం (భోగాపురం) విశాఖపట్నం సిటీ సెంటర్ నుంచి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రయాణికులు ఎలాంటి ఆలస్యం లేకుండా చెక్-ఇన్ పక్రియలను పూర్తి చేసుకోవడానికి.. విమానం టైం కంటే కనీసం 120 నిమిషాల ముందే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోవాలని స్కూట్ ఎయిర్ లైన్స్ సంస్థ సూచించింది.

# పంట అమ్ముకోలేక గోస పడుతున్న రైతు

**సర్కార్ తీరుపై మాజీ ఎమ్మెల్యే రసమయి ఆగ్రహం**

కరీంగనర్:పంట పండితే సంతోషించాల్సిన రైతన్న నేడు అమ్ముకోవడానికి దుఃఖిస్తున్నాడని.. ధాన్యం కొనుగోళ్లలో తీవ్రంగా జాప్యం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ధ్వజమెత్తారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. రెండు నెలలుగా రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ఉంటూ, ధాన్యం కొనకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నారన్నారు. సకాలంలో ధాన్యం కొనకపోవడంతో అప్పులు తీర్చలేక, ఎండవేడిమి తట్టుకోలేక రైతులు చనిపోతున్నారు. చీలాపూర్ గ్రామానికి చెందిన బాలయ్య అనే రైతు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో ఇప్పటికే 8మందికి పైగా చనిపోయారనీ, ఇవన్నీ ప్రభుత్వ హత్యలే అన్నారు. ఫొటోలకు పోజులు కొట్టి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి, వాటిని పర్యవేక్షించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర దోపిడీ జరుగుతున్నదనీ, స్వయంగా రైతులే తనకు చెప్పుకుని బాధపడుతున్నారనీ, ఏనాడు రాని నాణ్యమైన వడ్లు ఈ ఏడు వచ్చాయనీ, అలాంటి వడ్లను బీ గ్రేడ్ కు తీసుకొచ్చి రైతును ఆర్థికంగా దోచుకు తింటున్నా ఎవరు పట్టించుకోవడం లేదు ఆగ్రహం వ్యక్తం చేశారు. ÷నకొండూర్ నియోజకవర్గంలో ఎక్కడా కూడా ఏ గ్రేడ్ ధాన్యం రావడం లేదా..? అని ప్రశ్నించారు. బీ గ్రేడ్ ధాన్యం పేరు చెప్తూ బస్తా వడ్లపై రూ.20 దోచుకు తింటున్నది ఇక్కడున్న ఎమ్మెల్యే, కాంగ్రెస్ ప్రభుత్వమని ఆరోపించారు. యూరియా ఇచ్చేందుకు యాప్ లు పెట్టి రైతుల బతుకులను ఆగం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా..? అని అడిగారు.

# నీచ రాజకీయాలు జగన్‌కు అలవాటే

అమరావతి:వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ లబ్ది కోసం ఎంతటి నీచానికైనా దిగుతారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సొంత తండ్రి మరణాన్ని సైతం రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం జగన్‌కే చెల్లిందని, ఆయన వైఖరి అత్యంత బాధాకరమని విమర్శించారు. అమరావతిలో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. జగన్ గత ఐదేళ్ల పాలనపై, ఆయన రాజకీయ శైలిపై నిప్పులు చెరిగారు.
తండ్రి చావును కూడా రాజకీయ ప్రయోజనాలకు జగన్ వాడుకోవటం బాధాకరం. 5ఏళ్లు సీఎంగా ఉండి తండ్రి, బాబాయ్ హత్యపై అనుమానాలు ఎందుకు నివృత్తి చేయలేదు. అధికాకంలో ఉన్నప్పుడు అహంకారంతో వ్యవహరించి, ఇప్పుడు అధికారం పోయేసరికి ప్రజల్లో సానుభూతి కోసం 'బీద ఏడుపులు' ఏడవడం జగన్‌కే చెల్లిందన్నారు. ప్రజల్లో సానుభూతి పొందే ఆలోచనలు విరమించుకుని, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యమైతే జగన్ కే మంచిది. జగన్ పరిపాలన, అరాచకాలను అసహ్యించుకునే.. 2024 ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పారు. చంద్రబాబు నిర్ణయాలు నేటి తరంతో పాటు భవిష్యత్తు తరాలకూ ఉపయోగపడేలా ఉంటాయి. మూడు రాజధానులంటూ ప్రజల్లో తిరస్కరణకు గురయ్యారు.. ఇప్పుడు అమరావతి అభివృద్ధి చూసి ఓర్వలేక మావిగన్ అంటూ వితండవాదం చేస్తున్నారు. రాష్ట్రానికి, రాష్ట్రప్రజలకూ నష్టం చేసే నిలకడలేని జగన్ మాటలను ఎవరూ విశ్వసించరని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అమరావతి నిర్మాణంతో జగన్ తట్టుకోలేక పోతున్నారని మండిపడ్డారు.

# 2.5 కోట్ల విత్తన బంతుల పంపిణీ

అమరావతి:అటవీ శాఖ ఆధ్వర్యంలో 2.5 కోట్ల విత్తన బంతులను పంపిణీ చేయాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. వీటి తయారీ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని అన్నారు. అందుకు అన్ని వర్గాల ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖపై పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ నెలలో నిర్వహించనున్న విత్తన బంతుల (సీడ్ బాల్స్) తయారీ కార్యక్రమంపై అధికారులకు ఆయన దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాకాల సీజన్‌ను పూర్తిగా వినియోగించుకోవాలని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. జులై, ఆగస్టు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా విత్తన బంతులను విస్తారంగా చల్లడానికి అటవీ శాఖ ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు.

ఉత్తేజిత దినపత్రిక



## "ఒక నెల -- ఒక నియోజకవర్గం -- నాలుగు సందర్శనలు" కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

**సూళ్లూరుపేటఉత్తేజిత మే 22:**




శుక్రవారం సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "ఒక నెల -- ఒక నియోజకవర్గం -- నాలుగు సందర్శనలు" కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గం, వాకాడు మండల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో సూళ్లూరుపేట ఆర్డీఓ దేవేంద్ర రెడ్డితో కలసి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకాడు మరియు చిట్టమూరు తహసీల్దార్లు, మండల అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రజలకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వాకాడు మండలానికి సంబంధించిన రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖలు మరియు ఇతర శాఖలకు సంబంధించిన అర్జీలు నమోదైనట్లు తెలిపారు. ప్రజల సమస్యలను శాఖల వారీగా స్వీకరించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. గతంలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో వాకాడు మండలానికి సంబంధించి 131 అర్జీలు అందగా, వాటిలో 123 అర్జీలు పరిష్కరించడమైనదని తెలిపారు. అలాగే చిట్టమూరు మండలానికి సంబంధించి 49 అర్జీలు అందగా, అందులో 47 అర్జీలు పరిష్కరించడమైనదని వివరించారు. డీకేటీ పట్టాల కొరకు వచ్చిన అర్జీల విషయమై జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత దరఖాస్తులను పరిశీలించి అసైన్మెంట్ రివ్యూ కమిటీ ఏర్పాటుకు సిఫార్సు చేయాలని వాకాడు తహసీల్దారును ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలు కావడానికి అధికారులు ప్రజలతో సమన్వయం కలిగి పనిచేయాలని సూచించారు. ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించి ప్రభుత్వంపై ప్రజలకు మరింత విశ్వాసం కల్పించేలా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ అధికారుల సమక్షంలో

**జీవనోపాధి - ప్రభుత్వ పథకాలపై అవగాహన**

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు మే 22 :**




నందికొట్కూరులో నూతన జీవనోపాధి - ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు ను శుక్రవారం నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ఆదేశాల మేరకు నందికొట్కూరు పట్టణంలో సంగయ్యపేట రాయల్ ప్యాలస్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలకు ప్రత్యామ్నాయ నూతన వృత్తులు, ప్రభుత్వ సబ్సిడీ రుణాలు మరియు ఉపాధి అవకాశాలపై ఒక ప్రత్యేక అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పలు శాఖల ఉన్నతాధికారులు హాజరై, ప్రజలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను వివరించారు.

ముఖ్య అతిథిగా హాజరైననంద్యాల జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి సాదు రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రజలు ఒకే సాంప్రదాయ వృత్తికి పరిమితం కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన ఆర్థిక వృత్తుల్లోకి మారవలసిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా నాటుసారా వంటి అనారోగ్యకరమైన, చట్టవిరుద్ధమైన వ్యాపారాలను పూర్తిగా మానుకొని, గౌరవప్రదమైన జీవనోపాధి వైపు అడుగులు వేయాలి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ వంటి పథకాల ద్వారా చిన్నపాటి పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు లభించే సబ్సిడీ రుణాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం

నంద్యాల జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి. రాముడు, నందికొట్కూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ తప్పుడు మార్గాలను వీడి.. ప్రభుత్వ సబ్సిడీలు, బ్యాంక్ రుణాలు, మరియు ఉపాధి శిక్షణలను సద్వినియోగం చేసుకొని స్వయం సమృద్ధి సాధించాలి అన్నారు. స్వయం ఉపాధి మరియు వ్యాపారాల స్థాపనకు బ్యాంకుల ద్వారా పూర్తి సహకారం ఉంటుంది. కనీసం నలుగురు నుండి పది మంది సభ్యులు సంఘంగా (గ్రూప్ ) ఏర్పడితే సులభంగా రుణాలు పొందవచ్చు. అలాగే డిగ్రీ చదివే పిల్లల ఉన్నత చదువుల కోసం ఎడ్యుకేషన్ లోన్ సదుపాయం కూడా అందుబాటులో ఉంటుందన్నారు.

గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో కుటీర పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహాన్ని అందిస్తోంది. కనీసం 8వ తరగతి చదివి ఉండి, సొంతంగా విస్తారాకుల తయారీ, పచ్చళ్ల తయారీ, వడియాల తయారీ వంటి గృహ పరిశ్రమలు పెట్టుకోవాలనుకునే వారికి రాయితీలతో కూడిన రుణాలు మంజూరు చేస్తాము. మీరు ఒకరి దగ్గర పని చేసే వారిలా కాకుండా, మీరే ఇంకొకరికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. ముఖ్యముగా రాబోయే జూన్ నెలలో నందికొట్కూరు పట్టణంలో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నాము. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో

ఓబుల్ రెడ్డి ఎన్నార్డ్ శాఖ అధికారి, వెంకటరమణ స్కిల్ డెవలప్మెంట్,నంద్యాల ఎక్సైజ్ సి.ఐ లక్ష్మణ దాసు ఆత్మకూరు ఎక్సైజ్ సి.ఐ మోహన్ రెడ్డి మరియు నందికొట్కూరు ఎక్సైజ్ సి.ఐ రామాంజనేయులు, ఎస్.ఐ లుభాష్యం శ్రీనివాసులు,జగదీష మరియు నందికొట్కూరు మెప్మా శాఖ అర్చన, స్వయం సహాయక సంఘాల మహిళా తదితరులు పాల్గొన్నారు.

## అఘాయిత్యాలకు పాల్పడితే పిడి యాక్ట్.. తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు తీవ్ర హెచ్చరిక..




**రేణిగుంట: మే 22 ఉత్తేజిత బ్యూరో**


మహిళలు చిన్నారులపై వేధింపులు లేదా అఘాయిత్యాలకు పాల్పడే వారిపై తిరుపతి జిల్లా పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు స్పష్టం చేశారు. తప్పు చేస్తే మొదటిసారికే రౌడీషీట్ నమోదు చేయడమే కాకుండా నేరాలు పునరావృతమైతే పిడి ఆక్ట్ కింద జైలుకు పంపుతామని హెచ్చరించారు. గాజుల మండ్యం లో రేణిగుంట పోలీసులు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమాజంలో జరిగే అన్యాయాలపై పౌరులు మౌనంగా ఉండకుండా పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాలు డిజిటల్ అరెస్టుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'శక్తి 'యాప్ ను ప్రతి ఒక్కరూ మొబైల్స్ లో డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సబ్ డివిజన్ పోలీస్ అధికారి శ్రీనివాసరావు సీఐలు జయచంద్ర, మంజునాథ రెడ్డి ఎస్సైలు ధర్మారెడ్డి హరీష మరియు స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు

# ఫోక్సో కేసులో నిందితుడు అరెస్ట్

**సోషల్ మీడియా ఫోటోలు వైరల్ చేస్తానంటూ బాలికను బెదిరింపులు.**

**కేసు నుంచి తప్పించేందుకు సహకరించిన డిప్యూటీ తాసిల్దార్ అరెస్ట్**

**తిరుపతి క్రైమ్ బ్యూరో,మే 22. ఉత్తేజిత**



వరసకు కూతురైన మైనర్ బాలికను అత్యాచారం చేసిన కేసులో నిందితుడితో పాటు అతని భార్య డిప్యూటీ తాసిల్దార్ ను తిరుపతి ఈస్ట్ పోలీసులు అరెస్టు చేశారు. వేసవి సెలవులకు హైదరాబాదు నుండి తిరుపతిలో ఉంటున్న పిన్ని ఇంటికి మైనర్ బాలిక వచ్చింది అయితే తిరుపతి జీఎస్టీ డిపార్టుమెంటులో సీనియర్ అసిస్టెంట్గా రామ్మూర్తి బాధితురాలిపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన ఘటనపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసారు. పోలీసుల విచారణలో నిందితుడు తిరుపతిలో తాను నివసిస్తున్న ఇంటితో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా బాధిత బాలిక ఇష్టానికి వ్యతిరేకంగా బలవంతంగా లైంగిక దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అదేవిధంగా బాధితురాలితో ఫోన్లో, షేర్ చాట్ ద్వారా జరిపిన చాట్స్, కలిసి దిగిన సన్నిహిత ఫోటోలను తన వద్ద ఉంచుకొని, తాను పిలిచినప్పుడు రాకపోతే వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని, ఈ విషయం ఎవరితోనైనా చెబితే ఆమె తల్లిదండ్రులను హత్య చేస్తానని బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు.

ఈ విషయాన్ని తెలుసుకున్న బాధితురాలి తల్లిదండ్రులు తెలంగాణ రాష్ట్రంలోని జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, అక్కడ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కేసును జ్యూరిస్డిక్షన్ నిమిత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్కు బదిలీ చేశారు. జీరో ఎఫ్ఐఆర్ ఆధారంగా తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 263/2026 పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆధ్వర్యంలో తిరుపతి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి భక్తవత్సలం కేసును లోతుగా దర్యాప్తు చేసి కీలక ఆధారాలను సేకరించారు. దర్యాప్తులో ప్రధాన నిందితుడు రామ్మూర్తితో పాటు, కేసు నుంచి అతన్ని తప్పించేందుకు సహకరించిన బాధితురాలి పిన్ని మానస, డిప్యూటీ తహసీల్దార్, రైల్వే కోడూరు పాత్ర కూడా ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఇద్దరినీ పోలీసులు అరెస్ట్ చేసి, కోర్టు యందు ప్రవేశపరిచి జ్యుడీషియల్ రిమాండ్కు తరలించారు.

**ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి.**

మైనర్ బాలలపై జరిగే లైంగిక వేధింపులు, బెదిరింపులు, బ్లాక్మెయిల్ వంటి సంఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాచిపెట్టకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తిరుపతి పోలీసులు సూచించారు. సోషల్ మీడియా, చాట్ యాప్స్ ద్వారా ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే భయపడకుండా తల్లిదండ్రులు లేదా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. మైనర్ బాలల రక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, బాధితుల గోప్యతను పరిరక్షిస్తూ నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తిరుపతి పోలీసులు స్పష్టం చేశారు.

## సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు మే 22 :**



భారత ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ( ఎస్ ఐ ఆర్ )-2026 షెడ్యూల్ ప్రకటించింది. ఏపీ సీఈఓ ఆదేశాలమేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయములో నందికొట్కూరు ఏ ఈ ఆర్ వో తహసీల్దార్ శ్రీనివాసులు 136-నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గం ( ఎస్సీ ) లోని అన్ని జాతీయ / రాష్ట్రీయ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం లో రాజకీయ ప్రతినిధులకు ఎస్ ఐ ఆర్ - 2026 షెడ్యూల్ వివరించడం జరిగింది. ఈ సమావేశంలో జూపాడుబంగ్లా, పగిడ్యాల, పాములపాడు మండలాల తహసీల్దార్లు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్, ఎలక్షన్ సీనియర్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



# 98జీవో దీక్ష 58 రోజులు

**: దీక్షకు మద్దతు తెలిపిన రాయలసీమ సమితి అధ్యక్షులు డాక్టర్ .వెంకటసుబ్బారెడ్డి**

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు మే 22:**

నందికొట్కూరు లో 98జి వో దీక్షకు 58 రోజులు అయినప్పటికీ స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని రాయలసీమ సమితి అధ్యక్షులు . వెంకట సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్టు కొరకు సర్వం కోల్పోయిన బాధితులకు మద్దతు ప్రకటించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి స్థానిక ఎమ్మెల్యే గిత్త జయసూర్య స్పందించి న్యాయం చేయాలని అన్నారు.

కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్ర మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని అ న్నారు. ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలు పరిష్కరించకపోతే రాజీనామా చేయాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నీటి ముంపు నిర్వాసిత బాధితులు తదితరులు పాల్గొన్నారు.




## రైల్వే సమస్యలు పరిష్కరించండి... కేంద్ర మంత్రికి ఎంపీ గురుమూర్తి వినతి...

**రేణిగుంట రైల్వే స్టేషన్ ను ప్రధాన టెర్మినల్ గా అభివృద్ధి చేయాలి..**
**నైలెట్ శాశ్వత క్యాంపస్ కోసం రూ.300 కోట్లు కేటాయించండి....**

**న్యూఢిల్లీ: మే 22, ఉత్తేజిత ప్రతినిధి**



తిరుపతి పార్లమెంటు పరిధిలోని పెండింగ్ రైల్వే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర రైల్వే ఐటి శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ ను కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి ఆయన వినతి పత్రం సమర్పించారు. రేణిగుంట రైల్వే స్టేషన్ ను ఆధునిక వసతులతో ప్రధాన టెర్మినల్ గా అభివృద్ధి చేయాలని, శ్రీకాళహస్తి నడికుడి రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలని కోరారు. గూడూరు తిరుపతి మధ్య సింహపురి ఎక్స్ ప్రెస్ ను పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతి ఎయిర్ పోర్ట్ సమీపంలో నైలెట్ శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు రూ.300 కోట్లు మంజూరు చేయాలని ఎస్వీయూ ప్రతిపాదించిన సైబర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ కు మద్దతు ఇవ్వాలని ఎంపీ కేంద్ర మంత్రిని కోరారు.

# జూన్ 27న ముఖ్యమంత్రి చేతుల మీదుగా బంగారు ఉత్పత్తి పనులు ప్రారంభం... మంత్రి కొల్లు రవీంద్ర

**జియో మైసూర్ గోల్డ్ మైనింగ్ ప్రక్రియను పరిశీలించిన గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర.**

**తుగ్గలి: ఉత్తేజిత న్యూస్:**



మైనింగ్ ప్రక్రియ ద్వారా రాష్ట్రానికి ఆదాయంతో పాటుగా యువతకు ఉద్యోగాలు లభిస్తాయని ఘనవి శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలియజేశారు. శుక్రవారం రోజున తుగ్గలి మండలం జొన్నగిరి -- పగిడిరాయి గ్రామాల సమీపంలో ఉన్న జియో మైసూర్ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తున్న గోల్డ్ మైన్స్‌ను రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ,ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర,పత్తికొండ ఎమ్మెల్యే శ్యామ్ బాబు కలిసి సందర్శించారు.గోల్డ్ మైనింగ్ కార్యకలాపాలు,ఆధునిక సాంకేతిక పద్ధతులు,ఖనిజ శుద్ధి ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ జొన్నగిరి గోల్డ్ మైన్స్‌లో అత్యాధునిక యంత్రాంగం,నూతన సాంకేతిక పద్ధతులు ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం గనుల్లో సుమారు 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో రెండు కిలోమీటర్ల లోతు వరకు వెళ్లే అవకాశముందని తెలిపారు.లోతుకు వెళ్లే కొద్దీ బంగారం నిల్వలు మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు.ప్రస్తుతం రోజుకు సగటున ఒక కిలో బంగారం ఉత్పత్తి అవుతుండగా, నెలకు సుమారు 30 కిలోల వరకు ఉత్పత్తి చేస్తున్నారని వెల్లడించారు. జొన్నగిరి పరిసర ప్రాంతాల్లో సుమారు 13 వేల టన్నుల వరకు ఖనిజ నిల్వలు ఉన్నాయని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు రెండు లక్షల టన్నుల ఖనిజాన్ని ప్రాసెసింగ్ చేసినట్లు వివరించారు.ఈ గోల్డ్ మైన్ దేశంలోనే తొలి ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో మైనిం
గ్ రంగంలో ఇంకా విస్తృత అవకాశాలు ఉన్నాయని,అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో కూడా గోల్డ్ మైనింగ్‌కు అనుకూల ప్రాంతాలను గుర్తించామని చెప్పారు.త్వరలోనే అక్కడి ప్రక్రియలను పూర్తి చేసి అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.గత ప్రభుత్వ కాలంలో మైనింగ్ రంగం నిర్లక్ష్యానికి గురైందని,ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఖనిజ సంపదను రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు.రాష్ట్ర తీరప్రాంతాల్లో లభించే రేర్ ఎర్త్ మినరల్స్‌కు ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ ఉందని,చైనాకు పోటీగా నిలిచే స్థాయిలో మన దేశంలో ఖనిజ వనరులు ఉన్నాయని పేర్కొన్నారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ అభివృద్ధికి అవసరమైన బ్లాకులను గుర్తించి టెండర్ ప్రక్రియలు పూర్తి చేస్తున్నామని తెలిపారు.అదే విధంగా క్వార్ట్జ్ ఖనిజానికి విలువ ఆధారిత పరిశ్రమలు తీసుకువచ్చి, సోలార్ ప్యానెల్స్ వంటి ఉత్పత్తులను రాష్ట్రంలోనే తయారు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.దీని ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని చెప్పారు.అలాగే రాష్ట్రంలో లభించే గ్రానైట్‌కు అంతర్జాతీయ మార్కెట్లో భారీ డిమాండ్ ఉందని,వాటిని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి అలంకార వస్తువుల తయారీకి ప్రోత్సాహం అందించనున్నట్లు వెల్లడించారు.జొన్నగిరి గోల్డ్ మైన్స్‌ను ముఖ్యమంత్రి త్వరలో సందర్శించే అవకాశముందని మంత్రి తెలిపారు.రాష్ట్ర ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించి మైనింగ్ రంగంలో గత ఏడాదితో పోలిస్తే 30 శాతం వృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేసిందన్నారు.భవిష్యత్తులో మైనింగ్ రంగం ద్వారా రాష్ట్రానికి మరింత ఆదాయం,ఉపాధి, పారిశ్రామికాభివృద్ధి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ,రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, గ్రంథాలయం సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర,గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగని,పత్తికొండ డిఎస్పి వెంకటరామయ్య, జియో మైసూర్ ప్రాజెక్టు డైరెక్టర్ గణేషన్, జియో మైసూర్ సంస్థ జిఎం బాలాజీ,జియో మైసూర్ సంస్థ పిఆర్ఓ రాజేష్,సంస్థ ప్రతినిధులు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ విద్యా దోపిడీని అరికట్టాలి

**తిరుపతి జిల్లా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కోకిల ముని చందు**

**శ్రీకాళహస్తి,మే 22 ( ఉత్తేజిత దినపత్రిక ):**




కార్పొరేట్ విద్యా దోపిడీని అరికట్టాలని తిరుపతి జిల్లా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కోకిల ముని చందు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి. మునిచందు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చేశాయని విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారా లేదా అన్న విషయం కూడా తెలియకముందే ముందస్తు అడ్మిషన్ల పేరుతో తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆవేదన చెందారు. 10% నుండి 25% వరకు ఫీజులు ముందుగానే కట్టించుకోవడం మాత్రమే కాకుండా, విద్యార్థులు తదుపరి తరగతికి ప్రమోట్ కాకముందే యూనిఫాములు, పుస్తకాలు బలవంతంగా కొనిపించడం దారుణమైన చర్య అని అన్నారు.

ఇప్పుడు కార్పొరేట్ విద్యాసంస్థలు కొత్తగా తీసుకొచ్చిన 'రీఛార్జ్ పద్ధతి' మరింత ప్రమాదకరంగా మారిందన్నారు.బయట బ్యాంక్ అకౌంట్లలో జీరో బ్యాలెన్స్ లేకుండా కనీస మొత్తాన్ని ఉంచాలని ఎలా చెబుతారో, అదే విధంగా విద్యార్థుల పేరుతో కార్పొరేట్ విద్యాసంస్థల అకౌంట్లలో కూడా ముందుగానే కొంత మొత్తం తప్పనిసరిగా జమ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని అన్నారు.చదువు ప్రారంభం కాకముందే డబ్బులు డిపాజిట్ చేయించుకొని, విద్యను ఒక రీఛార్జ్ వ్యవస్థలా మార్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.శ్రీకాళహస్తి పట్టణంలో ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ తల్లిదండ్రులను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా రీఛార్జ్ పద్ధతిలో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలను తక్షణమే మూసివేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు శివ , పట్టణ కార్యదర్శి చైతు, చరణ్, సంతోష్ ,బోస్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గంజహళ్లి, అగ్రహారం గ్రామాలకు మంచినీటి ట్యాంకర్లు

**గోనెగండ్ల ఉత్తేజిత న్యూస్ :-**



గోనెగండ్ల మండల పరిధిలోని గంజహళ్లి, అగ్రహారం గ్రామాల్లో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొనడంతో గ్రామ ప్రజలు వేసవి తాపానికి తట్టుకోలేక తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని గంజాహళ్లి గ్రామానికి చెందిన వడ్ల నరసింహ ఆచారి , దాసన్న, రమేష్, అగ్రహారం గ్రామ మాజీ సర్పంచ్ రంగారెడ్డి, వెంకటేష్, జయరాం గారు, ఎలీషా గారు, మణి , శేఖర్, రాజు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి బుట్టా రేణుక దృష్టికి తీసుకెళ్లారు.ప్రజల సమస్యల పట్ల ఎప్పుడూ అప్రమత్తంగా ఉండే శ్రీమతి బుట్టా రేణుక వెంటనే స్పందిస్తూ ఈ విషయాన్ని ఆమె భర్త,బుట్టా ఫౌండేషన్ అధినేత శ్రీ బుట్టా శివ నీలకంఠ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల కష్టాలను తెలుసుకున్న వెంటనే స్పందించిన శ్రీ బుట్టా శివ నీలకంఠ మానవతా దృక్పథంతో బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గంజహళ్లి, అగ్రహారం గ్రామాలకు మంచినీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా చేపట్టించారు. దీంతో గ్రామ ప్రజలకు తాత్కాలిక ఉపశమనం లభించింది.

ఎండాకాలంలో తాగునీటి కోసం అల్లాడుతున్న సమయంలో తమ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు ముందుకొచ్చిన శ్రీమతి బుట్టా రేణుకకి, సేవా కార్యక్రమాలతో ప్రజలకు అండగా నిలుస్తున్న బుట్టా ఫౌండేషన్ అధినేత శ్రీ బుట్టా శివ నీలకంఠకి గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యమవుతూ సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.

## శ్రీకాళహస్తి అభివృద్ధి ప్రదాత బొజ్జల జన్మదినము పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు

**శ్రీకాళహస్తి,మే 22 ( ఉత్తేజిత దినపత్రిక ):**



శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి జన్మదినం సందర్భంగా టిడిపి పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కలసి పలు సేవా కార్యక్రమాలు చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. విజ్ఞానగిరిపై వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద "బొజ్జల సుధీర్ రెడ్డి" పేరు మీద తెలుగుదేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి, అనంతరం 101 కొబ్బరికాయలతో మొక్కు తీర్చుకోవడం జరిగింది, అనంతరం సుబ్రహ్మణ్యం స్వామి ఆలయం వద్ద మొక్కులు తీర్చుకొని శాసనసభ్యుల వారికి ఆరోగ్యము,ఐశ్వర్యము,ఉన్నత పదవి లభించాలని పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం శ్రీకాళహస్తి కోపరేటివ్ టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బాలు ఢిల్లీ బాబు ఆధ్వర్యంలో ప్రాంతీయ వైద్యశాల నందు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి మండలంలోని గంగలపూడి గ్రామం నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని గాలి గోపురం వద్ద అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు విజయకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ కంటా రమేష్, ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గురప్ప శెట్టి, టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఢిల్లీ బాబు, అక్షింతల కృష్ణ యాదవ్, రామచంద్రయ్య, రామకృష్ణ యాదవ్,ఆర్మగం, వంకాయల సిద్దులయ్య, గంగలపూడి హరి, ఎంపీ శ్రీను, కోరా రాకేష్, వివేక్ గౌడ్, కోలా సుబ్రహ్మణ్యం,కటికం సుబ్రహ్మణ్యం, వెంకట్ గౌడ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న శ్రీ చైతన్య పాఠశాలను సీజ్ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు..

**తిరుపతి ఉత్తేజిత మే 22.**

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్ముతూ సెలవు దినాలలో టీచర్లను వేధిస్తున్న శ్రీ చైతన్య పాఠశాలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ ఏఐఎస్బి బీసీవై విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో కోర్ట్ రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య పాఠశాల వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి ఏఐఎస్బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వి, బీసీవై విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ సురేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు ప్రచారాలు నిర్వహిస్తున్న కోర్ట్ రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి డీఈవో ఆదేశాలతో ఈరోజు పాఠశాల కార్యాలయాన్ని సీజ్ చేశారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జూన్ అకాడమిక్ ఇయర్లో అడ్మిషన్లు ప్రారంభించాలని ఇప్పటికే డీఈఓ ఆదేశాలు జారీ చేసినప్పటికీ రెండు మూడుసార్లు శ్రీ చైతన్య విద్యాసంస్థల యాజమాన్యులకు హెచ్చరికలు అందజేసిన కూడా వాళ్ళ తీరు మారకపోవడంతో ఈరోజు జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. కేవలం ముందస్తు అడ్మిషన్లు ప్రచారాలే కాకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలను వేళ్ల రూపాయలకు అమ్ముతున్నారని మండిపడ్డారు. జిల్లా విద్యాశాఖ అధికారులు బురిడీ కొట్టిస్తూ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఒక తరగతికి అనుమతి తీసుకొని అదే తరగతికు సంబంధించి అధునపు సెక్షన్లు నిర్వహిస్తూ అధికారులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు మరోవైపు నర్సరీ ఎల్కేజీ యూకేజీ తరగతులకు అనుమతులు లేకపోయినప్పటికీ వందల మంది విద్యార్థులను చేర్పిస్తున్నారని పేర్కొన్నారు. సెలవు దినాలలో టీచర్లను బ్రాంచ్కు పిలిపించుకొని వేధిస్తున్నారని తెలిపారు. కోర్ట్ రోడ్డు వద్ద ఉన్న శ్రీ చైతన్య పాఠశాలకు కనీసం గ్రౌండ్ కూడా లేకుండా నిర్వహిస్తా ఉన్నారు అక్కడ విద్యను బోధిస్తున్న టీచర్లు కూడా ప్రభుత్వం నిబంధన ప్రకారం క్వాలిఫైడ్ టీచర్లు లేకుండా విద్యను బోధిస్తున్నారని తెలిపారు.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న శ్రీ చైతన్య పాఠశాలల పైన జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సందర్భంగా హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్ నాయకులు నాని బాబ్జాన్ తేజ సుశ్రిత్ దినేష్ సోను ఆఫాన్ ఏఐఎస్బి నాయకులు నరేష్ గౌతమ్ ప్రవీణ్ అక్షయ్ బీసీవై విద్యార్థి విభాగం నాయకులు రాము తదితరులు పాల్గొన్నారులి

## మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసిన వైసిపి నాయకులు

**తుగ్గలి: ఉత్తేజిత న్యూస్:**



వైసీపీ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని పత్తికొండ నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకులు తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి, ఎర్రగుడి రామచంద్రారెడ్డి,రాతన మోహన్ రెడ్డి,తుగ్గలి మోహన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి,రెవెన్యూ ఉద్యోగుల సంఘం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు టిఎండి హుస్సేన్‌లు విజయవాడలో గురువారం రోజున రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు,పార్టీ బలోపేతం, గ్రామస్థాయి కార్యకర్తలపై నాయకులతో ఆయన విస్తృతంగా చర్చించారు.పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమై ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వైఎస్సార్సీపీ సిద్ధాంతాలను బలోపేతం చేయాలని జగన్మోహన్ రెడ్డి నాయకులకు సూచించినట్లు నాయకులు తెలియజేశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, కార్యకర్తల అభిప్రాయాలు,భవిష్యత్ కార్యాచరణపై నాయకుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. స్థానిక ఎన్నికలలో వైసీపీ పార్టీ సత్తా చాటేలా కృషి చేయాలని ఆయన తెలియజేశారన్నారు.ఈ సమావేశంలో జగన్‌ను కలిసిన అనంతరం నాయకులు మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతం దిశగా పనిచేస్తామని అన్నారు.

## అటెండర్ టు రికార్డు అసిస్టెంట్ ప్రమోషన్స్ ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేసిన....




**రేణిగుంటఉత్తేజిత మే 22 :-**

నాన్ టీచింగ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా తరఫున ఇంటర్మీడియట్ కమిషనర్ రంజిత్ భాష, ఆర్జెడి కడప సురేష్ బాబుకి అటెండర్ నుంచి రికార్డ్ అసిస్టెంట్ ప్రమోషన్స్ ఇచ్చినందుకు నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కందాటి విశ్వేశ్వర్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటెండెడ్ టు రికార్డు అసిస్టెంట్ ప్రమోషన్స్ పొందిన అభ్యర్థులు వెంకటా చలపతి, వెంకట సిద్ధులు, చిన్నగొట్టిగల్లు కీర్తి కుమార్, పద్మావతి, సుజాత, ద్రాక్షాయని, వెంకటరమణ, భానుచందర్ వారు ఎనిమిది మందితో కలిసి కడపలోని ఆర్జీడి కార్యాలయం వెళ్లి ఉన్నతాధికారులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కందటి విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జూనియర్ లెక్చరర్ల ప్రమోషన్లలో కూడా 10% నాన్ టీచింగ్ స్టాఫ్ కేటాయించాలని కోరినట్లు తెలిపారు.

## పిల్లల సమక్షంలో "బొజ్జల" జన్మదిన సంబరాలు

**శ్రీకాళహస్తి,మే 22 ( ఉత్తేజిత దినపత్రిక )**



: శ్రీకాళహస్తి పట్టణం లోని స్థానిక ఎన్టీఆర్ నగర్, మంచినీళ్లగుంట అంగన్వాడీ కేంద్రము నందు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి జన్మదినన్ని పురస్కరించుకుని రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్లూరు బుజ్జి ఆధ్వర్యంలో పిల్లల సమక్షంలో కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలకు పలకలు, బాలపాల ప్యాకెట్ లు, స్వీట్ లు, బిస్కెట్ లు, పంచిపెట్టారు. ఈ సందర్భంగా నెమళ్లూరు బుజ్జి మాట్లాడుతూ పసిపిల్లలు దైవ సమానులని, ఎలాంటి కల్మషం లేని వారు అలాంటి పసిపిల్లల మధ్య ఎమ్మెల్యే పుట్టినరోజు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని నెమళ్లూరు బుజ్జి తెలిపారు. ఎమ్మెల్యే కూడ పసిపిల్లల మనస్తత్వం కలవారని ఎలాంటి కల్మషం లేనివారు కాబట్టి శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి బాటలో నడుపుతున్నారు. కావున బొజ్జల సుధీర్ రెడ్డి,వారి కుటుంబ సభ్యులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, జీవించాలని శ్రీ జ్ఞానప్రసూనాంభికాదేవి సమేత వాయులింగేశ్వరా స్వామి వారిని ప్రార్దస్తున్నామని అన్నారు.ఎమ్మెల్యే జన్మదిన వేడుకల కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పూల శేఖర్, శివకుమార్, బాలయ్య, ఆకుల సునీత, నున్నా అనూషమహమ్మద్, రమేశబాబు, సులేమాన్, వంశీకృష్ణ, టైలర్ వాసు, శివ, హరి, తేజ, నాగమ్మ, మునికుమార్, చందు, సాలారఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ప్రాంతీయాభివృద్ధికి కొత్త దిశ

**పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు.**

**తుగ్గలి: ఉత్తేజిత న్యూస్:**



జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రారంభం కావడంతో ప్రాంతీయాభివృద్ధికి కొత్త దిశ మొదలవుతుందని పత్తికొండ శాసనసభ్యులు కేఈ శాంబాబు తెలియజేశారు.గోల్డ్ మైనింగ్ పనులు ప్రారంభం కావడం ద్వారా ప్రాంతాలే కాకుండా మండలం,జిల్లా,రాష్ట్రం కూడా అభివృద్ధి వైపు ముందుకు సాగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సరైన ప్రోత్సాహం, పారదర్శకత లేకపోవడం వల్ల ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగలేదన్నారు. అప్పటి పాలకుల వైఖరి కారణంగా సంస్థ అనేక ఇబ్బందులు ఎదుర్కొని,తటస్థ ధోరణిలో కొనసాగాల్సి వచ్చిందని పేర్కొన్నారు.అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గోల్డ్ మైన్ కార్యకలాపాలు వేగవంతమయ్యాయని చెప్పారు.జొన్నగిరి గోల్డ్ మైన్ ద్వారా రాష్ట్రానికి గణనీయమైన ఆదాయం సమకూరుతుండటంతో పాటు స్థానిక యువతకు ఉపాధి లభిస్తోందన్నారు. ఇప్పటికే 300 నుండి 400 మందికిపైగా స్థానిక యువతకు,విద్యావంతులకు, కార్మికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు.ముఖ్యంగా ప్రతి సంవత్సరం ఎండాకాలంలో వలసలకు వెళ్లే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు గోల్డ్ మైన్ కారణంగా స్థానికంగా ఉపాధి లభిస్తూ వలసలను తగ్గించే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే పర్యావరణ అనుమతులు,నీటి కేటాయింపులు వంటి కీలక అంశాలు అప్పటి ఉప ముఖ్యమంత్రి కే.ఈ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పూర్తి అయ్యాయన్నారు.

ఉత్తేజిత దినపత్రిక



# ఎంజేపీ బ్రాండింగ్ క్రియేట్ చేయాలి

- విద్యార్థులకు సమగ్ర విద్యాబోధన జరగాలి
- 8వ తరగతి నుండే నీట్, ఎంసెట్ తర్ఫీదు
- 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు అభినందనలు
- ఫలితాలు తక్కువగా వచ్చిన ప్రిన్సిపాల్‌లకు హెచ్చరిక
- పూలే గురుకుల పాఠశాలల ఫలితాలపై సమీక్షలో మంత్రి పొన్నం



**హైదరాబాద్, మే 21 :** మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయాల పనితీరు పై మంత్రి పొన్నం ప్రభాకర్ గారు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రిన్సిపాల్స్ ను అభినందించారు. ఫలితాలు తక్కువగా వచ్చిన గురుకుల విద్యాసంస్థలు కారణాలు సమీక్షించుకోవాలని ఆయన సూచించారు. వచ్చే విద్యాసంవత్సరం మంచి ఫలితాలు సాధించేలా పని చేయాలిని ఆయన అన్నారు. సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలు వచ్చే విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉండాలని ఆదిశగా అధ్యాపక బృందం పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. విద్యార్థులకు చదువులతో పాటు ఆటలు , సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్, ఏఐ, తదితర అంశాలపై ఉన్నత స్థానాలకు ఎదిగేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలను అభిందించడంతో పాటు ఉత్తీర్ణత శాతం తక్కువగా వచ్చిన పాఠశాలల ప్రిన్సిపాల్ లను మందిలించారు. వచ్చే విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు రాబట్టాలని సూచించారు. గతంలో 327 స్కూల్ లలో 301 స్కూల్ లో ప్రైవేట్ భవనాల్లో ఉన్నాయని, ప్రభుత్వం విద్యకు ప్రధాన్యత ఇవ్వడం తో గురుకులాలు అద్భుతంగా పని చేస్తున్నాయనీ తెలిపారు. గురుకుల పాఠశాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ప్రభుత్వం మెస్ ఛార్జీలు కాస్మొటిక్ చార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వం మీద విశ్వాసంతో ,అధ్యాపకుల విశ్వాసంతో తమ పిల్లలను గురుకులాలకు పంపిస్తున్నారనీ తల్లిదండ్రుల కన్నా ఎక్కువగా ఉపాధ్యాయుల తోనే పిల్లలు సమయం ఇస్తారని తమ సొంత పిల్లల మాదిరి విద్యార్థులను చూసుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మంచైనా,చెడైనా అధ్యాపకులు దిక్సూచి అని తెలిపారు. 026-27 సంవత్సరానికి రాష్ట్రంలోని అన్ని బీసీ సంక్షేమ శాఖ గురుకులాలు మరింత సమర్థవంతంగా విజయాలు సాధించాలనీ ఆకాంక్షించారు. ఎవరిని ఇబ్బంది పెట్టి పని చేయించుకోవడం లేదనీ పూర్తి స్థాయిలో విద్యా బోధన జరగాలనీ ఆదేశించారు.ప్రైవేట్ భవనాల్లో నెల వారి అ÷-దదె కడుతున్నప్పటికీ మౌలిక సదుపాయాలు లేకపోతే కల్పించుకునే బాధ్యత ప్రిన్సిపల్ లది సూచించారు.టాయిలెట్స్, ఫ్యాన్స్,ఇతర మౌలిక సదుపాయాలు ఏం ఇబ్బందులు లేకుండా చూసుకోవాలనీ తెలిపారు.ఎంజేపీ గురుకులాలు అద్భుతంగా ఉండాలంటే అందరూ కలిసి సమిష్టి గా ఒక కుటుంబం లాగ పని చేయాలన్నారు.పిల్లల ఉజ్వల భవిష్యత్తు జ్ఞాపకులపై ఆధారపడి ఉందన్నారు. సమాజంలో ఏ విధంగా బతకాలి , డిసిప్లెన్, తల్లిదండ్రుల తో ఎలా వ్యవహరించాలి..పెద్దలతో ఎలా మాట్లాడాలి అని విద్యార్థులకు నేర్పించాలని సూచించారు.చిన్న చిన్న కారణాలతో గురుకులాల్లో సూసైడ్ జరుగుతున్నాయని విద్యార్థుల్లో మనో ధైర్యాన్ని కల్పించాలని వారిలో మోటివేటివ్ కల్పించాలన్నారు.జిల్లాలో ఉన్న స్కూల్స్ వారిగా సమీక్షలు చేస్తూ వంద శాతం ఫలితాలు వచ్చిన స్కూల్స్ అభినందిస్తూ.. తక్కువ ఫలితాలు వచ్చిన స్కూల్స్ ఆత్మపరిశీలిన చేసుకోవాలనీ సూచించారు. అధ్యాపకులంతాఎంజేపీ కి బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేయాలనీ పేర్కొన్నారు.పదవ తరగతి 98.45 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల సెక్రెటరీ సైదులు తో పాటు ప్రిన్సిపల్ లను అభినందించారు.500 పైన వచ్చిన మార్కులు 9788 మంది విద్యార్థులకు వచ్చాయనీ204 ఎంజేపీ గురుకులాలు 100 శాతం ఫలితాలు సాధించాయనీ సంతోషం వ్యక్తం చేశారు.65 స్కూల్స్ వెనుకబడి ఉన్నాయనీ ఆ స్కూల్స్ ఆత్మపరిశీలిన చేసుకోవాలి ఉత్తీర్ణత తక్కువగా వస్తె మంచిది కాదనీ హెచ్చరించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 90.31 శాతం ,ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో 97.72 శాతం , ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 85.80 శాతం, ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 95.81 శాతం పాస్ శాతం ఉందని 900 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 4183 మంది విద్యార్థులు ,980 మార్కులు పైన 496 మంది విద్యార్థులు సాధించారనీ ఇంటర్మీడియట్ లో తక్కువ ఉత్తీర్ణత శాతం వచ్చిన గురుకులాలను హెచ్చరించారు.35 విద్యా సంస్థలు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయనీ అభినందించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 8 విద్యా సంస్థలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. ఎంజేపీ లో చదివిన పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులకు నేరుగా ఇంటర్మీడియట్ తరగతులకు అడ్మిషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గురుకుల పాఠశాలల్లో అవసరమైన మౌళిక సదుపాయాలు ఇంకా ఏమి అవసరమని ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు.

# హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ

- గోవధ నిషేధ చట్టాలు ఉల్లంఘనలు కోకొల్లలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**హైదరాబాద్, మే 21 :** తెలంగాణలో గోవధ నిషేధ చట్టాలు ఉల్లంఘనకు గురవుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్‌లో గోవుల అక్రమ రవాణా, వధ జరుగుతోందని అన్నారు. చట్టాలు ఉన్నప్పటికీ కొందరు కావాలనే వాటిని ఉల్లంఘిస్తున్నారని ఆయన మండిపడ్డారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ జరుగుతోందని రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోమాత రక్షణ కోసం శాంతియుతంగా పనిచేస్తున్న గోరక్షకులు, బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని రాంచందర్ రావు ఆరోపించారు. గోరక్షకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ కార్యకర్తలపై విధించిన బైండోవర్ చర్యలను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గోవుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రాంచందర్ రావు సూచించారు. గోవధకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ÷రిళిలీసులు పక్షపాత ధోరణిని విడిచిపెట్టి చట్టాన్ని అందరికీ సమానంగా అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు. గోమాత హిందువుల జీవన విధానంలో పవిత్రమైన భాగమని, పండుగల పేరుతో గోవధ చేస్తే సహించబోమని హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే శక్తులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో గోవధ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన తమ కార్యకర్తలను వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



## భారత ముఖచిత్రాన్ని మార్చిన రాజీవ్

### వర్ధంతి సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి నివాళి

**హైదరాబాద్, మే 21 :** భారతదేశ ముఖచిత్రాన్ని మార్చిన మహోన్నత నాయకుడు, మాజీ ప్రధాని, 'భారత రత్న' స్వర్గీయ రాజీవ్ గాంధీ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఉన్న తన నివాసంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన రాజీవ్ గాంధీ సేవలు స్మరించుకున్నారు. భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపించిన ఘనత, ఆధునిక సాంకేతిక విప్లవానికి నాంది పలికిన దార్శనికుడు రాజీవ్ గాంధీ. దేశంలో ఐటీ, టెలికాం రంగాల్లో నేడు మనం చూస్తున్న పురోగతి ఆయన వేసిన పునాదే. దేశ సమగ్రత, ఐక్యత కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరవీరుడు రాజీవ్ గాంధీ. ఆయన ఆశయ సాధన కోసం, దేశ పురోభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి.' అని పేర్కొన్నారు.రాజీవ్ గాంధీ చూపిన శాంతి, సామరస్యం, లౌకికవాద మార్గంలో నడుస్తూ, బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, అభిమానులు పాల్గొని అంజలి ఘటించారు.

## దళారుకుల ధాన్యం అమ్ముకోవద్దు

### రైతులకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి సూచన

**ఆసిఫాబాద్, మే 21 :** రైతులు తాము పండించిన జొన్న ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మార్కెట్ కమిటీ గోదాంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్), మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో క్వింటాల్ జొన్నలకు మద్దతు ధర రూ. 3,699 ప్రభుత్వం చెల్లించి కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుమేత విశ్వనాథ్ రావు, జైనూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కొడప ప్రకాష్, జైనూర్ సహకార సంఘం చైర్మన్ కొడప హన్ను పటేల్, ఆసిఫాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ కనక యాదవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్ హాజరయ్యారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

### రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా క్రీడా దినోత్సవం

**హైదరాబాద్, మే 21 :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 'స్పోర్ట్స్ అండ్ యూత్ వారోత్సవాలు' కార్యక్రమాల్లో భాగంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా 'క్రీడా దినోత్సవం'ను అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని 32 జిల్లా కేంద్రాల్లో జిల్లా కలెక్టర్లు మరియు అధికార యంత్రాంగం పర్యవేక్షణలో జిల్లా యువజన మరియు క్రీడాశాఖ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు విజయవంతంగా జరిగాయి. రాష్ట్ర స్థాయి ప్రధాన ఉత్సవాలు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడగా, యువత, క్రీడాకారులు, తల్లిదండ్రులు మరియు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జంట నగరాల్లోని గచ్చిబౌలి జీఎంసీబీ స్టేడియం, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, జింఖానా గ్రౌండ్స్, సైక్లింగ్ వెలోడ్రోమ్ తదితర క్రీడా వేదికల్లో ఇంటర్ స్టేడియా కాంపిటీషన్స్ నిర్వహించబడ్డాయి. పోటీల్లో అ÷-లథెటిక్స్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, ఫెన్సింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, ఫుట్‌బాల్, చెస్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, రెజ్లింగ్ తదితర క్రీడాంశాల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ. సోనీ బాలాదేవి ఈ పోటీలను స్వయంగా పర్యవేక్షించారు. ఆమె వివిధ క్రీడా విభాగాల్లో పాల్గొంటున్న క్రీడాకారులను కలుసుకుని ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న స్పోర్ట్స్ అండ్ యూత్ వారోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. యువతతో పాటు క్రీడాకారులు, తల్లిదండ్రులు మరియు సమాజంలోని వివిధ వర్గాల ప్రజల నుండి ఈ కార్యక్రమాలకు విశేష ఆదరణ లభిస్తోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల వారు, అన్ని వయస్సుల వారు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకునేలా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తోందని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొనే అవకాశాలను కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు రవితేజ, సుజాత, శ్రీనివాస్, స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు రవికుమార్, రాజ్‌వీర్, నందకిషోర్, కన్నం మధు, పీఆర్‌వో కాలేరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు

### 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిల నియామకం

**హైదరాబాద్, మే 21 :** బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కోసం అధినేత కేసీఆర్ ఇన్‌ఛార్జిలను ప్రకటించారు. డిజిటల్ పక్రియలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు జరగనుంది. 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను బీఆర్ఎస్ అధినేత నియమించారు. నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలకు తెలంగాణ భవన్‌లో ఐటీ నిపుణులతో డిజిటల్ శిక్షణ ఇవ్వనున్నారు. సభ్యత్వ నమోదు కోసం డిజిటల్ యాప్‌ను రూపొందించారు. తెలంగాణ భవన్‌లో శిక్షణ తర్వాత.. పార్టీ జిల్లా కార్యాలయాల్లో పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. పోలింగ్ బూత్‌కు ఇద్దరు చొప్పున వారం రోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. డిజిటల్ సభ్యత్వ నమోదు శిక్షణ పూర్తయిన తర్వాత.. సభ్యత్వ పునరుద్ధరణను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రారంభించనున్నారు.

## రామగుండం.. అగ్నిగుండం

### ఎండల తీవ్రతతో ప్రజల బెంబేలు

**రామగుండం, మే 21 :** రోహిణీ కార్తె ముందు రోళ్లు పగిలే ఎండలు కొట్టడం ప్రకృతి సహజ వైపరీత్యం. కానీ, ఈసారి కార్తెకు వారం రోజుల ముందు నుంచే ఎండలు ఉగ్రరూపం దాల్చడంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతం అగ్నిగుండంగా తయారైంది. ఈ నేపథ్యంలో గురువారం రామగుండంలో ఎండ తీవ్రత ప్రమాద స్థాయిలో ఉందని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ హెచ్చరిక జారీ చేసింది. ఈమేరకు పారిశ్రామిక ప్రాంతంలోని పలువురి మొబైల్ ఫోన్లకు సందేశాలు పంపించడంతో హడలెత్తిపోయారు. మధ్యాహ్నం 12 గం.ల నుంచి 4 గం.ల వరకు ఎట్టి పరిస్థితిలోనూ బయటకు రావొద్దని హెచ్చరించింది. వీలైనంత వరకు ఇంటిలోనే ఉంటూ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు తాగాలని సూచిక జారీ చేసింది. ఐతే గత నాలుగు రోజులుగా రామగుండంలో ఊహించని స్థాయిలో ఎండలు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. 45 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతల భయానికి జనాలు ఇళ్ల నుంచి బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. చుట్టూ వివిధ భారీ పరిశ్రమలు ఉండటంతో మిగతా ప్రాంతాల కంటే గోదావరిఖనిలో ఎండ దగడు ప్రమాద స్థాయిలో ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈనెల 25 నుంచి రోహిణీ కార్తె ఆరంభం కావడంతో అప్పటి పరిస్థితి తలచుకొని భయపడుతున్నారు.



## రాజీవ్‌కు భట్టి ఘన నివాళి

**న్యూఢిల్లీ, మే 21 :** భారతరత్న, దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా న్యూఢిల్లీలోని 'వీర్ భూమి' వద్ద డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కక ఘన నివాళులు అర్పించడం జరిగింది. భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు నడిపించిన మహోన్నత నాయకుడు రాజీవ్ గాంధీ అన్నారు. నవ భారత నిర్మాణం కోసం, యువతకు ఓటు హక్కు కల్పించి వారి సాధికారత కోసం ఆయన చూపిన దూరదృష్టి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం. దేశ ప్రగతి కోసం, ప్రజాస్వామ్య విలువల రక్షణ కోసం ఆయన చేసిన త్యాగాలు వృథా కావన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాల సాధనలో, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ప్రజా సేవకు నిరంతరం పునరంకితమౌతాం అని పిలుపునిచ్చారు.

## సంక్షేమ నిధి నుంచి జర్నలిస్టులకు ఆర్థిక సాయం

### 21 మందికి మంజూరు చేసినట్లు వెల్లడి

**హైదరాబాద్, మే 21 :** జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి 21 మందికి ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారంనాడు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ 5వ సమావేశం చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆర్థిక సహాయం కోసం వచ్చిన 29 దరఖాస్తులను కమిటీ సభ్యులు పరిశీలించి 17 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు, తీవ్ర ప్రమాదాలకు గురైన, దీర&ఝకాలికంగా అనారోగ్యం బారిన పడిన నలుగురు జర్నలిస్టులకు కూడా కమిటీ ఆర్థిక సహాయం మంజూరు చేసింది. కమిటీ సమావేశంలో ఎంపికైన 17 మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం, అలాగే ఆయా కుటుంబాలకు ప్రతి నెల మూడు వేల రూపాయల చొప్పున పెన్షన్ ఐదు సంవత్సరాల పాటు అందజేస్తామని ఆయన తెలిపారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలలో ఎల్.కే.జి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి నెలకు ఒక వెయ్యి రూపాయల చొప్పున ట్యూషన్ ఫీజును మంజూరు చేస్తున్నట్లు ఆయన వివరించారు. నలుగురు అనారోగ్యం బారిన పడిన వర్కింగ్ జర్నలిస్టులకు జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కమిటీ సమావేశంలో సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణ చందర్ రావు, మేనేజర్ డి.ఆర్.ఎస్. శైలెశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రంలో మంటలు

### దాదాపు వంద ధాన్యం బస్తాలు బుగ్గి

**ఖమ్మం,మే21 :** ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో రైతులు పొలాల్లో చెత్తకు నిప్పంటించడంతో ఆ మంటలు గాలికి వ్యాపించి కొనుగోలు కేంద్రంలోని వరి ధాన్యం బస్తాలకు అంటుకున్నాయి. దీంతో అక్కడ కాంటాలు వేసి ఉంచిన వరి బస్తాలు ఒక్కసారిగా మంటల్లో చిక్కుకుని దగ్ధమయ్యాయి. రైతులు వెంటనే మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ, గాలులు బలంగా వీయడంతో మంటలు అదుపులోకి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేసారు. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించినా స్పందన ఆలస్యమైందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో సుమారు వంద ధాన్యం బస్తాలు దగ్ధమయ్యాయని, లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి రాకపోతే ఇంకా పెద్ద ఎత్తున ధాన్యం నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



## కంటెయినర్‌లో మంటలు

### మంటల ధాటికి 8 కొత్త కార్లు బుగ్గి

**మెదక్, మే 21 :** మెదక్ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. తూప్రాన్ సమీపంలో జాతీయ రహదారి ఎన్‌హెచ్-44పై ప్రయాణిస్తున్న కంటైనర్ లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మహారాష్ట్ర వైపు నుంచి హైదరాబాద్‌కు వస్తున్నఈ కంటైనర్ లారీ అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లారీలో కొత్తగా తరలిస్తున్న ఎనిమిది మారుతీ కార్లు ఉన్నాయి. మంటలు ఒక్కసారిగా వ్యాపించి కంటైనర్‌తో పాటు అన్ని కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు ఎగిసిపడటంతో జాతీయ రహదారిపై భయాందోళన వాతావరణం నెలకొంది. స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదం కారణంగారహదారిపై కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. భద్రతా చర్యల్లో భాగంగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను పోలీసులు తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే విషయం. అయితే కోట్ల రూపాయల ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ లేదా సాంకేతిక లోపం వల్లే ఈ మంటలు చెలరేగి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడగా, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

# రేవంత్ ఆలోచనకు తగ్గట్లుగా ఫ్యూచర్ సిటీ కదిలేనా ?



**రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నరేళ్లు దాటింది. ఇక రేవంత్ రెడ్డికి ఉన్నది కేవలం రెండేళ్ల కాలం మాత్రమే. ఈ రెండేళ్లలో ఆయన అనుకున్న పనులు నెరవేరుస్తారా అన్నది అనుమానమే. ఎందుకంటే ఈ రెండున్నరేళ్లలో గట్టిగా ఒక నిర్మాణాత్మక పనికూడా చేపట్టలేదు. ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయాలేదు. ఎందుకంటే కేవలం సంక్షేమాలతో నెట్టుకు వస్తున్నారు. రేషన్ కార్డులు పెంచడం, సన్నబియ్యం ఇవ్వడం, రైతు భరోసా వేయడం వంటివన్నీ అభివృద్ధి కిందకు రావు. ఈ క్రమంలో ఆయన పెద్ద పనిని తలన పెట్టుకున్నారు. అదే ఫ్యూచర్ సిటీ. ఇప్పుడున్న హైదరాబాద్ ఇంతగా పెరగడానికి కొన్ని దశాబ్దాలు పట్టింది. మెల్లాగా ఇది అల్లుకుంటూ పోవడం వల్ల పెరిగందే తప్ప రాత్రికి రాత్రి పెరగలేదు. చంద్రబాబు సైబరాబాద్‌కు బీజం వేసినా, ఇవాళ ఓఆర్ఆర్ వరకు నగరం విస్తరించడానికి దాదాపు రెండున్నర దశాబ్దాల కాలం పట్టింది. అందువల్ల ఒక సిటీని కట్టాలంటే అనుకున్నంత ఈజీగా అమాంతంగా కట్టలేం. అమరావతి కోసం నిధులు ఉండీ చంద్రబాబు నానా తంటాలు పడుతున్నారు. మధ్యలో జగన్ మావిగన్ అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. అమరావతి ఇప్పట్లో పూర్తి అయ్యేలా లేదు. పోలవరం కట్టడానికి దాదాపు 15 ఏళ్లు పట్టింది. నిధులు ఉండి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తే ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగవచ్చు. కానీ ఫ్యూచర్ సిటీ కోసం రూపాయి కూడా వెచ్చించడానికి లేదు. నిధుల లేమి రాష్ట్రాన్ని పట్టి పీడిస్తోంది. అక్కడ భూములు సేకరించి ఉన్నాయి కనుక ఫ్యూచర్ సిటీ కట్టేయలేం. కొన్ని కార్యాలయాలు తరలించినా, కొందరికి భూములు కేటాయించినా ఇది సాధ్యం అయ్యే పనికాదు. దీనికి తోడు కేవలం రెండంటే రెండేళ్ల కాలం మాత్రమే ఉంది.**

ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, నెట్ జీరో తరహాలో రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇందులో ఎలాంటి రాజీ పడొద్దని కూడా చెప్పారు. ఈ మేరకు ప్రపంచస్థాయి నగరాలను అధ్యయనం చేసి ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. ఇప్పటికే అక్కడ ఓ ఈవెంట్ నిర్వహించి, పెట్టుబడిదారులను ఆహ్వానించినా, అక్కడ ఎలాంటి మౌళిక వసతులు లేకుండా ఎలా అడుగు వేస్తారో అధికారుకలకు కూడా అర్థం కాదు. ఫ్యూచర్ సిటీలో భూ కేటాయింపులు, పరిశ్రమల ఏర్పాటు అంశాలపై ఎన్ని ఆదేశాలు జారీ చేసినా నిర్దిష్ట ప్రణాళిక మేరకు ముందుకు సాగాల్సి ఉంటుంది. ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టుల కోసం 500 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించారు. మౌలిక సదుపాయాల నిర్మాణం తర్వాతే భూ కేటాయింపులు జరపాలన్నారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకువచ్చేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను కూడా తీసుకొద్దామని, అవసరమైతే ప్రధాని నరేంద్రమోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామన్నారు. జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమల నిర్మాణం ప్రారంభించేలా నిబంధనలు రూపొందించాలన్నారు.

పెట్టుబడులను ఆకర్షించటం కోసం 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరిట ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని, దీనికి లోగో, వెబ్‌సైట్ రూపొందిం చాలని ఆదేశించారు. పెట్టుబడులకు ముందుకొచ్చేవారికి ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను తీసుకురావాలని, గ్రూప్-1 స్థాయి అధికారులను నియమించాలన్నారు. ఇవన్నీ బాగానే ఉన్నా, అక్కడ మౌళిక వసతులు, ముఖ్యంగా రోడ్లు, నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను పెద్ద ఎత్తున చేపట్టాల్సి ఉంటుంది. బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్టు కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినా, అందుకు కేంద్రం త్వరగా నిధులు విడుదల చేయాల్సి ఉంది. 1500 ఎకరాల్లో డేటా సిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఫ్యూచర్ సిటీ దేనికి ప్రాధాన్యం అన్నది కూడా ముఖ్యమే. ఇప్పటికిప్పుడు అక్కడికి వెళ్లి ఉండలేం. అక్కడ ఎలాంటి మౌళిక వసతులు లేకుండా ఎవ్వరు కూడా ఉండలేరు. ఇది ఓరకంగా చెప్పాలంటే త్రిశంకు స్వర్గాన్ని సృష్టించడమే అవుతుంది. 2029లో జరిగే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని... పదిన్నరేళ్లు సీఎంగా పనిచేసి రికార్డు సృష్టిస్తానని రేవంత్‌రెడ్డి ఇటీవలే ప్రకటించారు. బహుశా ఇదే ధీమాతో మరో పదేళ్లకు దీని గురించి ప్లాన్ వేసుకున్నారా అన్నది తెలియదు. ఒకవేళ సిఎం రేవంత్ రెడ్డిని ప్రజలు మరోమారు గెలిపించక పోతే ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ ఏంటన్నది ప్రశ్నార్థకం. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఎవరు సిఎం అన్నది అప్పుడే నిర్ణయిస్తారు. ఒక్క వైఎస్ విషయంలో మాత్రమే రెండో ఆలోచన లేకుండా ఆయనను సిఎం చేశారు. అధిష్ఠానం ఎవరిని నిర్ణయిస్తే వారే ముఖ్యమంత్రి అని ప్రకటించడం కాంగ్రెస్ ఆనవాయితీ. దీనికి భిన్నంగా, వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్నారు. ఆయన చేసిన ఈ ప్రకటన కొంతమంది కాంగ్రెస్ నాయకులకు మింగుడు పడకపోవచ్చు.

అయితే తనకు తాను ఇలా ప్రకటించుకున్నా, పరిస్థితులు మన చేతుల్లో లేవు. తమిళనాడు, కేరళ, బెంగాల్ పరిస్థితులు చూశాం. వచ్చే రెండేళ్లలో ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. కొంతమంది మంత్రులు సమాంతర వ్యవస్థలను నడుపుతున్నారన్న విమర్శ ఉంది. కాబట్టి నిర్మాణాత్మక వైఖరి అవసరం. అందుకు అనుగుణంగా కార్యాచారణ కావాలి. ప్రజల్లో ఇమేజ్ సంపాదించాలి. ఇవన్నీ చేసి, మళ్లీ అధికారంలోకి వస్తేనే ఫ్యూచర్ సిటీపై ప్రభావం ఉంటుంది. లేకుంటే ఈ రెండేళ్ల స్వల్ప కాలంలో ఇది మనుగడలోకి రావడం ముమ్మాటికీ సాధ్యం కాకపోవచ్చు.

# విదేశీ పర్యటన ముగించుకున్న ప్రధాని మోడీ

## విదేశీ ప్రతినిధులకు విలువైన కానుకలు అందచేత



**న్యూఢిల్లీ, మే 21 :** ప్రధాని నరేంద్ర మోదీ ఐదు దేశాల పర్యటనను ముగించుకుని గురువారం భారత్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనల నేపథ్యంలో మోదీ ఆయా దేశాల నేతలకు భారత సంస్కృతి ఉట్టిపడేలా పలు కానుకలు అందజేశారు. ఇటలీ అధ్యక్షుడికి పండిట్ భీమ్‌సేన్ జోషి, ఎంఎస్ సుబ్బలక్ష్మి పాటల సీడీలు కలిగిన మార్బుల్ ఇన్‌లే వర్క్ బాక్స్‌ను బహుమతిగా ఇచ్చారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి అస్సాంలో ఫేమస్ అయిన ముగా సిల్క్ శాలువాను బహుకరించారు. తెల్లని పాలరాయితో తయారుచేసిన ఈ బాక్స్‌పై లాపిస్ లాజులి, టర్కోయిస్, మాలకైట్, పగడం వంటి రాళ్లను అలంకరించారు. ఈ పె÷-టటె లోపల భారత శాస్త్రీయ సంగీతంలోని ప్రముఖులైన పండిట్ భీమ్‌సేన్ జోషి, ఎంఎస్ సుబ్బలక్ష్మి పాడిన పాటల సీడీలు ఉన్నాయి. ఇక, మెలోనీకి.. అస్సాంలో 'గో÷-డలెన్ సిల్క్'గా గుర్తింపుపొందిన ముగా సిల్క్ శాలువాను బహుమతిగా ఇచ్చారు. మణిపూర్‌కు చెందిన శిరుయ్ లిలీ సిల్క్ స్కార్ఫ్‌ను కూడా గిఫ్ట్‌గా ఇచ్చారు. నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్‌కి చేపల ఆకృతితో ఉన్న మధుబని పెయింటింగ్‌ను బహుమతిగా ప్రధాని మోదీ అందజేశారు. ఈ మధుబని పెయింటింగ్ అత్యంత ప్రాచీనమైనది. ఈ పెయింటింగ్ భౌగోళిక గుర్తింపు పొందింది. జానపద కళను ప్రతిబింబించే ఈ పెయింటింగ్‌లు.. భారత్, నేపాల్‌లోని మిథిలా ప్రాంతంలో ఉంటాయి. పండగలు, వివాహాలు, ఆచార వ్యవహారాలు తదితర శుభకార్యాలకు సూచికగా ఈ పెయింటింగ్స్ వేస్తారు. ఈ మధుబని పెయింటింగ్స్‌కు సంబంధించిన మూలాలు భారతీయ పురాణాలు, జానపద కథల్లో ఉన్నాయి. పువ్వులు, పక్షులు, చెట్లు, చేపల వంటి ఆకృతుల ద్వారా దేవతలు, ప్రకృతితోపాటు రోజువారీ జీవిత దృశ్యాల ఈ పెయింటింగ్స్‌ల కనిపిస్తాయి. నెదర్లాండ్స్ ప్రధానికి ఈ కానుక ఇవ్వడం ద్వారా భారతీయ సంస్కృతి, ముఖ్యంగా మిథిలా కళారూపాన్ని పరిచయ చేసినట్లు అయిందనే చర్చ సాగుతోంది.

# దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత

- సాంకేతికతను దేశానికి పరిచయం చేసిన రాజీవ్
- రాజీవ్‌కు నివాళి అర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, మే 21 :** దేశం కోసం ప్రాణాలర్పించిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీఎంతో పాటు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవాన్ని దేశానికి అందించిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. 'కంప్యూటర్, ఐటీ, టెలికామ్‌లను దేశానికి తీసుకువచ్చింది ఆయనే. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చారు. రాహుల్‌గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసింది. తెలంగాణ సమాజం సోనియాగాంధీ కుటుంబానికి ఎంతో రుణపడి ఉంది. సోనియా సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ సాకారమైంది. మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులో మోదీ సర్కార్ కుయుక్తులు పన్నింది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు డీలిమిటేషన్‌తో లింక్ పెట్టారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. మహిళా బిల్లును ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ పార్లమెంట్‌లో పెట్టాలని సీఎం డిమాండ్ చేశారు. దేశంలో సాంకేతికతను తీసుకొచ్చిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని తెలిపారు. సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ అని చెప్పు కొచ్చారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ కల సాకారమైందని సీఎం అన్నారు. తెలంగాణకు గాంధీ కుటుంబంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. అది కుటుంబ సంబంధం కంటే ఎక్కువని తెలిపారు. తెలంగాణ ఉన్నంత వరకు ప్రజలు గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటారని అన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలన్నారు. తక్షణమే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు... రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దానం నాగేందర్, అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

- వేసవి సెలవులతో భక్తుల రాక
- దర్శనానికి 24గంటలకు పైగా సమయం

**తిరుమల, మే 21 :** వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో రద్దీ పెరుగుతోంది. శ్రీవారి దర్శనానికి కనీసం 24 గంటలపైగా సమయం పడుతోంది. శ్రీవారి దర్శనానికి గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగుతోంది. దీంతో భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్2, నారాయణగిరి షెడ్స్ నిండిపోయి రింగ్ రోడ్డులోని పాచికాల్వ గంగమ్మ ఆలయం వరకు క్యూలైన్లో సుమారు నాలుగు కిలోమీటర్లు వేచి ఉన్నారు. సర్వదర్శనానికి 24 గంటలపైగా సమయం పడుతోందని తితిదే ప్రకటించింది. రద్దీ నేపథ్యంలో సంయమనంతో శ్రీవారిని దర్శించుకోవాలని తితిదే భక్తులకు సూచిస్తోంది. మరోవైపు తితిదే ఆధ్వర్యంలో ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు, అన్నప్రసాద కేంద్రాలు, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, ఆలయ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులు ఎప్పటికప్పుడు అంచనా వేసి, అధికారులు అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, పాలు, అన్న ప్రసాదాలు శ్రీవారి సేవకుల ద్వారా అందిస్తున్నారు. తితిదే యంత్రాంగం సమన్వయంతో భక్తులకు దర్శనం కల్పించేందుకు 24 గంటలూ ప్రత్యేకంగా దృష్టి సారించారు. పోలీసులు, తితిదే విజిలెన్స్ అధికారులు రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి రద్దీని నియంత్రిస్తున్నారు. రద్దీ నేపథ్యంలో అధికారులు భక్తులను క్యూలైన్లలోకి అనుమతించడం లేదు.



# రూపాయి పతనంపై ఆర్‌బిఐ దిద్దుబాటు

## అధికారులతో గవర్నర్ మల్హోత్రా మంతనాలు

**ముంబయి, మే 21 :** రూపాయి విలువను స్థిరీకరించడానికి, వడ్డీ రేట్ల పెంపుతో సహా అందుబాటులో ఉన్న అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) పరిశీలిస్తోందని సంబంధిత అధికారులను ఉద్దేశించి 'బ్లూమ్‌బెర్గ్' గురువారం ఒక నివేదికలో వెల్లడించింది. రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో సహా ఆర్‌బీఐ ఉన్నతాధికారులు వరుస అంతర్గత సమావేశాలు నిర్వహించినట్లు ఈ నివేదిక పేర్కొంది. గడిచిన బుధవారం నాటి ట్రేడింగ్‌లో రూపాయి అంతర్గతంగా 96.95 వద్ద రికార్డు స్థాయి కనిష్టానికి పడిపోయింది. ఆ తర్వాత కోలుకుని డాలర్‌తో పోలిస్తే 96.86 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ ఇండెక్స్ బలంగా ఉండటం, ముడి చమురు ధరలు అధికంగా కొనసాగడంతో డాలర్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఈ పరిణామాల వల్లే రూపాయి విలువ చారిత్రక కనిష్ట స్థాయికి పడిపోయి, కొత్త ముగింపు రికార్డును నమోదు చేసింది. అయితే, గురువారం ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి తన సర్వకాలిక కనిష్ట ముగింపు స్థాయి నుండి 41 పైసలు పుంజుకుని అమెరికా డాలర్‌తో పోలిస్తే 96.45కు చేరుకుంది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి 96.25 వద్ద బలంగా ప్రారంభమై, ఆ తర్వాత స్వల్పంగా తగ్గి 96.45 వద్ద ట్రేడయ్యింది. బుధవారం నాటి ముగింపు ధర 96.86తో పోలిస్తే ఇది 41 పైసల రికవరీని సూచిస్తోంది.

# చంద్రగిరి మండలంలో ఏనుగుల బీభత్సం

**తిరుపతి, మే 21 :** తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం రంగంపేట దగ్గర నాగపట్ల ప్రాంతం, రాగిమానుగుంటలో ఏనుగుల గుంపు బుధవారం రాత్రి బీభత్సం సృష్టించాయి. అర్ధరాత్రి మామిడి తోటలోకి వచ్చిన ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసి పూర్తిగా ధ్వంసం చేసాయి. ఏనుగుల గుంపు గ్రామ పరిసరాల్లోకి చొరబడి, అర్ధరాత్రి ఏనుగులు పంట పొలాల్లో భీకర శబ్దాలతో గీంకరిస్తుండగా, గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రైతుల మామిడి తోట, ఫెన్సింగ్ కూసాలు, నీటి పైపులను ఏనుగులు పూర్తిగా ధ్వంసం చేసాయి. మూడు రోజులుగా నాగపట్లలోనే గజరాజులు చేరినట్లు రైతులు అనుమానిస్తున్నారు. వెంటనే ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు గ్రామస్తులు తెలియజేశారు. అటవీశాఖ అధికారులు ఏనుగుల అటవీప్రాంతంలోకి తరిమేందుకు, బాణా సంచా పేలుస్తూ, డప్పు శబ్దాలతో ప్రయత్నించారు. పంట నష్టం తప్ప ఎటువంటి ప్రమాదం జరగలేదు. గ్రామస్తులు రాత్రిపూట బయటకు రాకూడదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు అటవీశాఖ అధికారులు తెలియజేసారు.

# 28న బక్రీద్ సెలవు

**అమరావతి, మే 21 :** ముస్లిం లు భక్తిశ్రద్ధలతో జరుపుకునే బక్రీద్ పండగ సెలవు దినాన్ని మారుస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముందుగా ప్రకటించిన మే 27న కాకుండా మే 28వ తేదీన ఈ బక్రీద్ సెలవు దినంగా ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు ఈ మార్పు వర్తిస్తుందని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. గతంలో ఏపీ ప్రభుత్వం విడుదల చేసిన వార్షిక క్యాలెండర్ ప్రకారం.. మే 27వ తేదీ బక్రీద్ సెలవుగా ప్రకటించారు. అయితే చంద్రదర్శనం ఆధారంగా పండుగ తేదీ మారింది. దాంతో సెలవు రోజును కూడా మార్చాలని ఏప రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్య కార్య నిర్వాహణాధికారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ బోర్డు సీఈవో చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం పరిశీలించింది. అనంతరం సెలవును మే 28కి మారుస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోవో జారీ చేశారు.

# గుంటూరు జిల్లాలో అగ్నిప్రమాదం

**గుంటూరు, మే 21 :** గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికంగా ఉన్న ఓ స్క్రాప్ గోడౌన్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గోడౌన్‌లో నిల్వ ఉంచిన పాత ఇనుప సామాన్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు మంటలకు ఆహుతి అయ్యాయి. మంటలు చెలరేగిన కొద్ది సేపటికే అవి షెడ్డు అంతటా వేగంగా వ్యాపించాయి. దీంతో భారీ అగ్నికీలలు ఎగిసిపడుతూ, దట్టమైన పొగ ఆకాశాన్ని కమ్మేసింది. ప్రమాద తీవ్రతను గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రమాదం కారణంగా భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు ప్రాథమిక సమాచారం.



# విజయ్ కేబినేట్‌లో కొత్తగా 23మందికి చోటు

## ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మంత్రి యోగం

**చెన్నై, మే 21 :** తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే పార్టీ అధినేత విజయ్ తన కేబినెట్‌ను విస్తరించారు. కొత్తగా 23 మంది ఎమ్మెల్యేలు నేడు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. 21 మంది టీవీకే ఎమ్మెల్యేలతో పాటు మిత్రపక్షం కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటుదక్కింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, తనకు మద్దతిచ్చిన కాంగ్రెస్‌తో పాటు ఐయూఎమ్‌ఎల్, వీసీకే పార్టీలకు కూడా సీఎం విజయ్ కేబినెట్ బెర్తు ఆఫర్ చేశారు. అయితే, మరికొంతకాలం తరువాత ఐయూఎమ్-ఎల్, వీసీకేలు కేబినెట్‌లో చేరే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. సీపీఐ, సీపీఎంలను కూడా సీఎం విజయ్ మంత్రివర్గంలోకి ఆహ్వానించినట్టు మంత్రి ఆధవ్ అర్జున తెలిపారు. వీసీకే చీఫ్ తోల్ తిరుమావళన్ మంత్రివర్గంలో చేరాలని తాము ఆశిస్తున్నట్టు కూడా పేర్కొన్నారు. మే 10న జరిగిన ప్రమాణస్వీకారంలో విజయ్‌తో పాటు 9 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఇక తమిళనాడు కేబినెట్‌లో గరిష్ఠంగా 35 మంది మంత్రులకు అవకాశం ఉంది. తాజాగా 23 ఎమ్మెల్యేలు మంత్రులుగా చేరడంతో మంత్రి వర్గం సంఖ్య 32కు చేరింది. దీంతో, మరో ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటుదక్కే ఛాన్స్ ఉంది.

# నష్టాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు

## బలపడిన రూపాయి

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌పై ఒత్తిడి కారణంగా సూచీలు ప్రభావితమయ్యాయి. ఉదయం లాభాల్లో ట్రేడయిన సూచీలు.. చివరికి నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ 135.03 పాయింట్లు నష్టపోయి 75,183.36 పాయింట్ల వద్ద ముగియగా.. నిఫ్టీ 4.30 పాయింట్ల నష్టంతో 23,654.70 వద్ద స్థిరపడింది. ఆర్‌బీఐ రంగ ప్రవేశంతో డాలరుతో రూపాయి విలువ 63 పైసలు బలపడి 96.23కు చేరుకుంది. ఉదయం 75,732.42 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,318.39) లాభాల్లో ప్రారంభమైన సూచీ.. ఇంట్రాడేలో 74,996.78 - 75,945.79 మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఇండిగో, బీఈఎల్, ట్రెంట్, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు లాభపడ్డాయి.



అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ 104 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4518 డాలర్ల వద్ద కొనసాగుతోంది.






# మారుతీ సుజుకీ ధరల షాక్..

## రూ.30వేల వరకు పెంపు

**న్యూఢిల్లీ:** ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ వినియోగదారులకు షాక్ ఇచ్చింది. అన్ని మోడళ్లపై రూ.30వేల వరకు ధరలు పెంచుతున్నట్లు గురువారం ప్రకటించింది. జూన్ నుంచి ఈ పెంపు చేపట్టనున్నట్లు వెల్లడించింది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వెల్లడించింది. గడిచిన కొన్ని నెలలుగా ఖర్చుల ప్రభావాన్ని తగ్గించడానికి కంపెనీ ప్రయత్నాలు చేస్తూనే ఉందని, అనివార్య పరిస్థితుల్లో వినియోగదారులపై అధిక ప్రభావం పడకుండా ఆ భారాన్ని బదిలీ చేయాల్సి వస్తోందని ఓ ప్రకటనలో వెల్లడించింది. మారుతీ సుజుకీ ప్రస్తుతం ఎస్-ప్రెస్సో వంటి ఎంట్రీలెవల్ మోడళ్ల నుంచి ప్రీమియం యుటిలిటీ వెహికల్ అయిన ఇన్విక్టో వరకు వివిధ మోడళ్లను విక్రయిస్తోంది. వీటి ధరలు రూ.3.49 లక్షల నుంచి ప్రారంభమై రూ.28.7 లక్షల వరకు ఉన్నాయి. గతేడాది సెప్టెంబర్‌లో జీఎస్టీ 2.0 నిర్ణయం కారణంగా ఆయా కార్ల ధరలు భారీగా తగ్గాయి. ఎస్-ప్రెస్సో రూ.1.29 లక్షలు, ఆల్టో కే10పై రూ.1.07 లక్షలు, సెలిరియో రూ.94వేలు, వ్యాగనార్‌పై రూ.79 వేల చొప్పున తగ్గాయి. తాజా పెంపు నిర్ణయంతో వాటి ధరలు గరిష్ఠంగా రూ.30వేల వరకు పెరగనున్నాయి.



# 11 వేల కోట్లతో జెప్టో ఐపీఓ..

## త్వరలో వచ్చేందుకు సన్నాహాలు

ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థ జెప్టో తొలి పబ్లిక్ ఆఫర్‌కు వచ్చేందుకు సిద్ధమవుతోంది. జులైలో రూ.11 వేల కోట్లను మార్కెట్ నుంచి సమీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. జులై 31లోపు పబ్లిక్ ఇష్యూకు రావాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకు అవసరమైన అప్‌డేటెడ్ ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఐపీఓకు వచ్చేందుకు కాన్ఫిడెన్షియల్ రూట్‌లో గతేడాది డిసెంబర్‌లో సెబీకి ముసాయిదా పత్రాలను జెప్టో సమర్పించింది. దీనివల్ల పోటీదారులకు మేలు చేకూర్చే సున్నిత సమాచారమేది బయటకు రాదు. ఐపీఓ దరఖాస్తు చేసుకున్నా తర్వాత ఏమైనా అభ్యంతరాలుంటే సెబీ తెలియజేస్తుంది. అందుకు అవసరమైన పత్రాలను మరోసారి కంపెనీ సమర్పించాల్సి ఉంటుంది. కాగా ఇప్పటికే జెప్టోకు ప్రత్యర్థులైన బ్లింకిట్ మాతృ సంస్థ ఎటర్నల్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ పేరెంట్ కంపెనీ స్విగ్గీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యాయి. 2020లో అదిత్‌పలిచా, కైవల్య వోహ్రా తొలుత కిరాణాకార్ట్ పేరుతో జెప్టోను స్థాపించారు. 45 నిమిషాల్లో డెలివరీ సేవలకు శ్రీకారం చుట్టారు. తర్వాత సొంతంగా డార్క్ స్టోర్లు ఏర్పాటు చేసుకుని 10 నిమిషాల్లో డెలివరీ సేవలను ప్రారంభించారు. అదే తర్వాతి కాలంలో జెప్టోగా మారింది. తొలుత ముంబయిలో ఈ సేవలను ప్రారంభించారు. తర్వాత దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాలకు విస్తరించారు. క్విక్‌కామర్స్ సెగ్మెంట్‌లో అత్యధిక డార్క్ స్టోర్‌లు ఉన్న సంస్థగా జెప్టో నిలిచింది. దేశంలోని 61 నగరాల్లో 1225 డార్క్ స్టోర్లు ఉన్నట్లు ఇటీవల బ్రోకరేజీ సంస్థ బెర్న్‌స్టెయిన్ సంస్థ పేర్కొంది. నగరాల్లో సగటున 21 స్టోర్లను జెప్టో నిర్వహిస్తుండగా.. పోటీ సంస్థలు 9 మాత్రమే నిర్వహిస్తున్నాయి.



# ఈ ఏడాది లేఆఫ్‌లు లేనట్లే..

## ఆ ఉద్యోగులకు మెటా ఇచ్చే ప్యాకేజీ ఇదే..!

కృత్రిమ మేధను విస్తృతంగా వినియోగంలోకి తెస్తున్న టెక్ కంపెనీలు వేలాదిమంది ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి. ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా తన వర్క్‌ఫోర్స్‌లో 10 శాతం మందిని తొలగించే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించింది. ఈ ఏడాదిలో మరికొంతమందిని తొలగించే అవకాశాలున్నాయని వార్తలు వచ్చాయి. అయితే ఈ ఏడాది మరిన్ని లేఆఫ్‌లు ఉండకపోవచ్చని ఉద్యోగులకు పంపిన మెయిల్‌లో సీఈఓ జుకర్‌బర్గ్ (మీుతీన్గ బఓెవతీఎవతీస్త్ర) వెల్లడించారు. "విజయం దానంతట అది వచ్చేది కాదు. ఏఐ మన జీవితంలో అత్యంత ప్రభావాన్ని చూపించే సాంకేతికత. ఆ టెక్నాలజీని వేగంగా అందిపుచ్చుకునే సంస్థలే తర్వాత తరానికి ఒక మార్గం చూపిస్తాయి. ఈ కంపెనీ అభివృద్ధిలో భాగమైన వారికి గుడ్‌బై చెప్పడం ఎప్పుడూ బాధించే విషయమే. అది నేను అనుభవిస్తున్నాను" అని పేర్కొన్నారు. ఐరోపా, అమెరికా, సింగపూర్‌లలో కొందరు ఉద్యోగులకు 'ఇంటి నుంచి పని' చేసే అవకాశం కల్పించి.. అంతలోనే ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు 'ఇ-మెయిల్' ద్వారా సమాచారాన్ని మెటా పంపింది. అదే సమయంలో వారికి ఎంతమేర ప్యాకేజీ ఇస్తున్నారన్న దానిపైనా చర్చ మొదలైంది. అమెరికా వరకు చూస్తే.. లేఆఫ్ అయిన ఉద్యోగికి 16 వారాలకు సమానమైన బేస్ పేతో పాటు ఉద్యోగంలో కొనసాగిన ప్రతి ఏడాదికి రెండు వారాల వేతనాన్ని అందిస్తారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆ ఉద్యోగితో పాటు ఆ కుటుంబానికి 18 నెలల హెల్త్‌కేర్ కవరేజ్ అందుతుంది. అమెరికా వెలుపల ఉద్యోగం కోల్పోయిన వారికి అటూఇటూగా ఇలాగే చెల్లించనున్నారు.




# బెంబేలెత్తించిన గుజరాత్ బౌలర్లు..

## ఓటమితో చెన్నై ఇంటికి..

**అహ్మదాబాద్:** ఐపీఎల్ 2026లో భాగంగా.. అహ్మదాబాద్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 89 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. అనంతరం 230 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై సూపర్ కింగ్స్ 13.4 ఓవర్లలో కేవలం 140 పరుగులకే ఆలౌటైంది. శివమ్ దూబె (47; 17 బంతుల్లో, 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) టాప్ స్కోరర్. మాథ్యూ షార్ట్ (24) ఫర్వాలేదనిపించాడు. సంజు శాంసన్ (0), రుతురాజ్ గైక్వాడ్ (16), ఉర్విల్ పటేల్ (0), కార్తిక్ శర్మ (19), డెవాల్డ్ బ్రెవిస్ (8), అన్షుల్ కాంబోజ్ (19) ఇలా బ్యాటర్లంతా తక్కువ పరుగులకే వెనుదిరిగారు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో మహ్మద్ సిరాజ్, కగిసో రబాడా, రషీద్ ఖాన్ తలో మూడు వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. ఈ ఓటమితో చెన్నై టోర్నీ నుంచి నిష్క్రమించింది. అంతకు ముందు గుజరాత్ బ్యాటర్లలో సాయి సుదర్శన్ (84; 53 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్ (64; 37 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), జోస్ బట్లర్ (57; 27 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లలో ముకేశ్ చౌదరి, స్పెన్సర్ జాన్సన్, అన్షుల్ కాంబోజ్ తలో వికెట్ తీసుకున్నారు.



### నా సేవలకు గుర్తింపు దక్కడం లేదు: గుత్తా జ్వాల



భారత బ్యాడ్మింటన్ వ్యవస్థపై మాజీ డబుల్స్ స్టార్ గుత్తా జ్వాల తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆటగాళ్ల అభివృద్ధిలో గుత్తాధిపత్యం, పక్షపాతం, దీర్ఘకాలిక దృష్టి లోపం ఉన్నాయని ఆమె ఆరోపించారు. దేశంలో బ్యాడ్మింటన్ అభివృద్ధి కోసం తాను చేసిన సేవలకు గుర్తింపు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన అకాడమీ ద్వారా క్షేత్రస్థాయిలో సేవలందించేందుకు అధికారులను పదేపదే సంప్రదించినప్పటికీ చాలావరకు పట్టించుకోలేదని ఆరోపించారు. "ఈ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా ఉంది. ఇక్కడ పూర్తిగా గుత్తాధిపత్యం నడుస్తోంది. ఒకే వ్యక్తి అన్ని నిర్ణయిస్తాడు. నాకు కూడా ఒక అకాడమీ ఉందని నాలుగేళ్లుగా చెబుతున్నా. హైదరాబాద్‌లోని నా అకాడమీ దేశంలోనే అతిపెద్ద వాటిలో ఒకటి. 50,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో 14 కోర్టులు ఉన్నాయి, ఇదంతా నేనే స్వయంగా నిర్మించుకున్నాను. అయినా సరే నాకు ఎటువంటి మద్దతు లభించడం లేదు. నాకు అండర్-19 లేదా సీనియర్ క్యాంపులు వద్దు. అండర్-13 లేదా అండర్-15 ఆటగాళ్లను ఇవ్వండి. పిల్లలు బాగా ఆడతారు. తర్వాత వారు దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారు. నేను ముక్కుసూటిగా మాట్లాడతా. దీంతో నా అకాడమీలో శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ తిరుగుబాటుదారులుగా తయారవుతారని ముద్ర వేస్తున్నారు" అని విమర్శించారు.

# రోహిత్, కోహ్లీకి ఎప్పుడూ 'కాదు' అని చెప్పొద్దు : రికీ పాంటింగ్

భారత స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టెస్టులు, అంతర్జాతీయ టీ20లకు గుడ్ బై చెప్పి వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నారు. వీరిద్దరూ 2027 ప్రపంచ కప్ వరకు ఆడాలనుకుంటున్నారు. ప్రస్తుతం ఐపీఎల్ 2026లో కోహ్లీ అదరగొడుతున్నాడు. రోహిత్ గాయంతో ఇబ్బంది పడుతున్నా ఫర్వాలేదనిపిస్తున్నాడు. అయితే, వారి వన్డే భవిష్యత్తుపై ప్రస్తుతం ఊహాగానాలు నడుస్తున్నాయి. వరల్డ్ కప్‌లో వీరికి అవకాశం కల్పిస్తారా? లేక పక్కన పెడతారా? ఇప్పుడే ఏం చెప్పలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో రో-కో వన్డే భవిష్యత్‌పై ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు, పంజాబ్ కింగ్స్ కోచ్ రికీ పాంటింగ్ మాట్లాడాడు. రోహిత్, కోహ్లీ ఛాంపియన్లని, వారిని తక్కువ అంచనా వేయొద్దన్నాడు. వారిని తప్పకుండా ప్రపంచ కప్ జట్టులోకి తీసుకోవాలన్నాడు. "రో-కో కెరీర్‌ను ముందుకు నడిపిస్తూ వన్డే ప్రపంచ కప్ ఆడటానికి ప్రయత్నిస్తున్నారు. ఛాంపియన్ ఆటగాళ్ల గురించి నేను ఎప్పుడూ చెప్పే ఒక విషయం ఏమిటంటే వారికి ఎప్పుడూ 'కాదు' అని చెప్పకూడదు. వారిని ఎప్పుడూ తక్కువ అంచనా వేయకూడదు. ఈ ఐపీఎల్ విరాట్ మరోసారి రాణిస్తుండటమే అందుకు మంచి ఉదాహరణ. అతను ఒకప్పుడు ఆడినంతగా అంతర్జాతీయ క్రికెట్ ఆడకపోయినా ఆ పట్టుదల, గెలవాలనే తపన ఇప్పటికీ ఉన్నాయి. రోహిత్ శర్మ ఫిట్‌గా ఉన్నాడు. గత 10, 12 ఏళ్లలో




ఎప్పుడూ చూడనంత ఫిట్‌నెస్‌తో ఈ ఐపీఎల్‌లో ఆడుతున్నాడు. మరింత ముందుకు సాగి తమను తాము అత్యుత్తమ ఆటగాళ్లుగా తీర్చిదిద్దుకోవాలనే ఆ అభిరుచి ఆ ఆటగాళ్లలో ఇంకా ఉంది. అందుకే వారికి నో చెప్పకూడదు" అని పాంటింగ్ పేర్కొన్నాడు. జూన్‌లో అఫ్గానిస్థాన్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు రోహిత్, కోహ్లీ ఎంపికయ్యారు. కాకపోతే గాయంతో బాధపడుతున్న హిట్‌మ్యాన్ ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే బరిలోకి దిగుతాడు.



# కింగ్ 100

కింగ్ అక్కినేని నాగార్జున గత మూడున్నర దశాబ్దాలుగా సినీ అభిమానులను అలరిస్తున్నారు. విభిన్నమైన సినిమాలు, విభిన్నమైన పాత్రల్లో నటిస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా తనను తాను అప్‌డేట్ చేసుకుంటూ.. న్యూ ఏజ్ ఫిలిం మేకర్స్, కొత్త కథలతో ముందుకు సాగుతూ తన స్టార్‌డమ్‌ను నిలబెట్టుకున్నారు. నటుడిగానే కాదు, నిర్మాతగా కూడా ఇండస్ట్రీకి సేవలు అందిస్తున్నారు. టాలీవుడ్ నాలుగు పిల్లర్స్ లో ఒకరిగా నిలిచిన నాగ్.. తన కెరీర్ లో మైలురాయి 100వ సినిమాకి చేరువయ్యారు.

నాగార్జున 100వ సినిమాని ప్రస్తుతానికి 'కింగ్ 100' పేరుతో పిలుచుకుంటున్నారు. అదే వర్కింగ్ టైటిల్ తో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కోలీవుడ్ డైరెక్టర్ రా. కార్తీక్ దర్శకత్వంలో ఈ ప్రతిష్టాత్మక చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇది పవర్ ఫుల్ యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్ కలబోసిన సినిమా అని నాగార్జున గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఇప్పటి వరకూ నాగ్ చేసిన సినిమాలన్నిటికంటే ఇది ప్రత్యేకంగా ఉండేలా ప్లాన్ చేస్తున్నారని సమాచారం. కథ, ట్రీట్మెంట్, క్యారెక్టర్స్.. అన్నీ కొత్తగా ఉంటాయని, అందర్నీ ఆశ్చర్యపరిచేలా ఈ ప్రాజెక్ట్ ఉండబోతుందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నాగార్జున తాజాగా ఈ సినిమాకి సంబంధించిన అప్డేట్ అందించారు.

నాగార్జున బుధవారం శిర్డీ సాయిబాబాను దర్శించుకున్నారు. సాయిబాబా సమాధిని దర్శించుకుని, గురుస్థాన్, ద్వారకామాయి ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. సాయిబాబా సంస్థాన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి గోరక్ష గడిల్కర్ నాగార్జునకి శాలువా కప్పి సాయిబాబా విగ్రహం అందజేశారు. ఆయనతో పాటుగా 'శిరిడి సాయి' నిర్మాత మహేందర్ రెడ్డి కూడా ఉన్నారు. ఈ సందరరేగా నాగార్జున మాట్లాడుతూ.. కొత్త సంవత్సరంలో తన 100వ సినిమా షూటింగ్ జరుగుతుందని తెలిపారు.

'కింగ్ 100' సినిమాలో కథ ప్రకారం మూడు కథానాయిక పాత్రలు ఉంటాయని టాక్ వినిపిస్తోంది. అందులో సీనియర్ నటి టబు, స్వీటీ అనుష్క శెట్టి, సుస్మితా భట్ లను హీరోయిన్లుగా ఎంపిక చేశారని చాలా రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. అన్నపూర? స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై నాగార్జున స్వయంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దీనికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూరుస్తారని సమాచారం.

# దేవుడా.. ఓ మంచి దేవుడా..

ఎన్నిసార్లు చూసిన బోర్ కొట్టని సినిమాలలో ' నువ్వు నాకు నచ్చావ్ !' ఒకటి. రెండున్నర దశాబ్దాల క్రితం రిలీజైన ఈ కామెడీ చిత్రం.. కల్ట్ క్లాసిక్ గా, ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఇన్నేళ్ల తర్వాత కూడా టీవీల్లో టెలికాస్ట్ ప్రతీసారి డీసెంట్ టీఆర్పీ వస్తుందంటే.. ఈ సినిమాకి ఫ్యామిలీ ఆడియన్స్ లో ఉన్న కల్ట్ ఫాలోయింగ్ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. అలాంటి చిత్రాన్ని మరోసారి అత్యాధునిక హంగులతో బిగ్ స్క్రీన్ మీదకు తీసుకొచ్చారు. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ జనవరి 1న రీ-రిలీజ్ చేశారు.

విక్టరీ వెంకటేష్ హీరోగా విజయ్ భాస్కర్ దర్శకత్వంలో 'నువ్వు నాకు నచ్చావ్' సినిమా తెరకెక్కింది. స్రవంతి రవికిషోర్ నిర్మించిన ఈ చిత్రానికి త్రివిక్రమ్ శ్రీనివాస్ కథ - మాటలు అందించారు. ఇందులో ఆర్తి అగర్వాల్ హీరోయిన్ గా నటించగా.. ప్రకాష్ రాజ్, చంద్రమోహన్, సుహాసిని, సునీల్, బ్రహ్మానందం, ఎంఎస్ నారాయణ, ప ృథ్వీ, ఆశా షైనీ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. వెంకీ కామెడీ టైమింగ్, త్రివిక్రమ్ మార్క్ పంచ్ డైలాగులు, కామెడీ సన్నివేశాలు, కోటి పాటలు ఈ సినిమాలో హైలైట్ గా నిలిచాయి.

సినిమాలో ప్రకాష్ రాజ్ ఫ్యామిలీ అంతా కలిసి భోజనానికి కూర్చొన్న సమయంలో, దేవుడిపై వెంకటేష్ ప్రార్థన సీన్.. ఆ తర్వాత "దేవుడా ఓ మంచి దేవుడా" అంటూ ప్రకాష్ రాజ్ అమ్మపై చదివే కవిత ఎవర్ గ్రీన్ అనే చెప్పాలి. థియేటర్లలో ఈ సన్నివేశానికి ప్రేక్షకులు పగలబడి నవ్వారు. ఇప్పటికీ ఆ సీన్ గుర్తొస్తే ఎవరికైనా వెంటనే నవ్వొచ్చేస్తుంది. సినిమాలో అంతలా పేలిన ఆ ఒక్క సన్నివేశాన్ని పూర్తి చేయడానికి దర్శకుడు విజయ్ భాస్కర్ కి ఏకంగా ఐదు నెలల సమయం పట్టిందట. ఈ విషయాన్ని ఆయన ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

హీరోయిన్ తండ్రి పాత్ర కోసం సీనియర్ నటుడు నాజర్ అయితే బాగుంటుందని విజయ్ భాస్కర్ భావించారట. కానీ నిర్మాత స్రవంతి రవికిషోర్ మాత్రం ప్రకాష్ రాజ్ ను తీసుకోవాలని సూచించారట. కానీ అదే సమయంలో టాలీవుడ్ లో ప్రకాష్ రాజ్ పై బ్యాన్ విధించారు. దాంతో ముందుగా ఆయన లేని సన్నివేశాలను తీయాలని నిర?యించుకున్నారట. ప్రకాష్ రాజ్ పై నిషేధం ఎత్తేసిన వెంటనే ఆయనకు సంబంధించిన సీన్స్ పూర్తి చేశారట. వెంకటేష్ ప్రార్థన చేసే డైనింగ్ టేబుల్ సన్నివేశం తీసే సమయానికి అందరి డేట్స్ ఒకేసారి దొరకలేదట. ఆర్టిస్టుల డేట్స్ దొరికితే కెమెరామెన్ వేరే సినిమాలతో బిజీగా ఉండేవారట. దీంతో అందుబాటులో ఉన్న యాక్టర్స్ తో క్లోజప్ షాట్స్ తీసుకుంటూ వచ్చి, ఐదు నెలలకి ఆ సీన్ ని పూర్తి చేశారట. "ఆ సీన్ ని ఐదుసార్లు తీశాం. మూడు షెడ్యూల్స్ లో షూట్ చేయాల్సి వచ్చింది. ఆర్తి అగర్వాల్ యూఎస్ వెళ్లిపోవాల్సి వస్తే, ముందుగా ఆమె షాట్స్ తీశాం. అప్పుడు ప్రకాష్ రాజ్ కి ఫిలిం ఛాంబర్ తో ఇష్యూ నడుస్తోంది. అది క్లియర్ అయిన తర్వాత ఆయనతో షూట్ చేశాం. సునీల్ బిజీగా ఉండటంతో, అతనికి సంబంధించిన పార్ట్ ని ఇంకోసారి చిత్రీకరించాం. వెంకటేష్ - ఎంఎస్ నారాయణ కాంబో సీన్స్ ఒకసారి చేశాం. ఇలా ఐదు సార్లు ఇద్దరు కెమెరామెన్లతో షూట్ చేశాం. ఆ ఒక్క సీన్ కి దాదాపు 5 నెలలు పట్టింది.



# రెట్టింపు వినోదం




రవితేజ హీరోగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఈ సంక్రాంతికి అదుతేమైన వినోదాన్ని అందించడానికి ఈ సినిమా సిద్ధంగా ఉంది. ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై మ్యాసీవ్ బజ్‌ను సృష్టించాయి. తాజాగా మేకర్స్ మరో బిగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా నుంచి 'వామ్మో వాయ్యో' సాంగ్‌ను ఈనెల 2న వరంగల్‌లో నిర్వహిస్తున్న గ్రాండ్ ఈవెంట్‌లో లాంచ్ చేయనున్నారు.సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రవితేజ మాస్ ఎనర్జీ అదిరిపోయింది. రవితేజ, ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి కలర్‌ఫుల్ అవుట్ ఫిట్స్‌లో మాస్ అండ్ స్టైలిష్‌గా డాన్స్ చేస్తూ కనిపించిన ఈ పోస్టర్ ఫర్‌ఫెక్ట్ ఫెస్టివల్ వైబ్‌ని సెట్ చేసింది. సాంగ్ ప్రోమో అదిరిపోయింది. ఫస్ట్ బీట్ నుంచే పండుగ జోష్‌ను తెరపైకి తీసుకొచ్చింది. రవితేజ తన ట్రేడ్‌మార్క్ ఎనర్జీ, స్వాగ్‌తో మెస్మరైజ్ చేశారు. ఆషికా రంగనాథ్, డింపుల్ గ్లామర్‌తో పాటు గ్రేస్‌ఫుల్ డాన్స్ మూమెంట్స్‌తో అలరించారు. మాస్ ఆడియెన్స్‌ను ఆకట్టుకునే హుక్ స్టెప్స్, గ్రాండ్ విజువల్స్‌తో థియేటర్‌లో ఈ పాట అందర్నీ అలరించనుంది.

# మరోసారి నిరూపించారు

కేఎల్ దామోదర్ ప్రసాద్ సమర్పణలో పోతుల హేమ వెంకటేశ్వరరావు నిర్మించిన చిత్రం 'ఈషా'. ఈ చిత్రంలో త్రిగుణ్, హెబ్బా పటేల్, అఖిల్ రాజ్, సిరి హన్మంత్, పృథ్వీరాజ్ తదితరులు కీలక పాత్రల్ని పోషించారు. ప్రస్తుతం ఈ మూవీ థియేటర్లలో సక్సెస్‌ఫుల్‌గా దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో చిత్రయూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నిర్మాత సురేష్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ, 'మా దాముని ఫిల్మ్ ఛాంబర్ పనులు చూసుకోమని ఇటు సైడ్ పంపించాం. ఆ బాధ్యతలన్నీ కూడా దాము ఎంతో సమర్థవంతంగా చూసుకుంటున్నారు. మళ్లీ ఇలా ఆయన 'ఈషా'తో ఆడియెన్స్ ముందుకు రావడం ఆనందంగా ఉంది. ఆడియెన్స్ ముందుకు తీసుకువచ్చి హిట్ చేసిన బన్నీ వాస్, నంది వంశిపాటికి కంగ్రాట్స్. నిజాయితీతో సినిమా తీస్తే హిట్ చేస్తామని ఆడియెన్స్ మరోసారి నిరూపించారు. చిన్నసినిమా, పెద్ద సినిమా అనేది ఉండదు. కంటెంట్ బాగుంటే సినిమా ఆడుతుంది. కంటెంట్ ఉన్న చిత్రాలనే ఆడియెన్స్ చూస్తారు. ఆడియెన్స్ పెట్టే డబ్బులు, వెచ్చించే సమయానికి తగ్గ కంటెంట్‌ను మనం ఇస్తున్నామా? లేదా? అన్నది చూసుకోవాలి. దాముకి హిట్ రావడం ఆనందంగా ఉంది' అని అన్నారు. 'బన్నీ వాస్, వంశీలకు దిష్టి తీయాలి. పిలిచిన వెంటనే వచ్చిన నా స్నేహితులు సురేష్, అశోక్‌లకు థ్యాంక్స్. అల్లు అరవింద్ ఇచ్చే ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఈ ఏడాదిలో చిన్న చిత్రాలుగా వచ్చి హిట్టు కొట్టిన వారిని పిలవాలని అనుకున్నాను. అసలు సినిమాల్లో చిన్నా, పెద్ద అన్నది లేదు. ఏది ఆడితే అది పెద్ద సినిమా.



# ఆసక్తికర వ్యాఖ్య



విజయం సాధించి ఎదిగితే తాను వారికి దొరకనేమోననే భయంతో కొంతమంది 'రాజాసాబ్' చిత్రం ఫ్లాప్ అవ్వాలని కోరుకుంటున్నట్లుందని ప్రముఖ దర్శకుడు మారుతి అన్నారు. ప్రభాస్, మాళవిక మోహనన్ ప్రధాన పాత్రల్లో మారుతి దర్శకత్వంలో, టీజీ విశ్వప్రసాద్, ఇషాన్ సక్సేనా నిర్మించిన చిత్రం 'రాజాసాబ్'. ఈ సినిమా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా మారుతి ఒక ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.


మీరు విజయం సాధించకూడదని, ఈ సినిమాకు ఆదరణ రాకూడదని కొందరు కోరుకుంటున్నారని, వాళ్ళు ఎందుకు అలా ఆలోచిస్తున్నారని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. దానికి మారుతి సమాధానమిస్తూ, తాను ఎదిగితే బిజీ అయిపోతానని కొందరు అలా భావిస్తుండవచ్చని అన్నారు. ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు కోరుకుంటారని, పక్కింటి వాళ్లు కారు కొనుక్కుంటే దానికి ఏదైనా అవ్వాలని కోరుకునే వాళ్లు ఉంటారని పేర్కొన్నారు.

ఈర్ష్య, అసూయ మానవ నైజమని మారుతి అన్నారు. తాను విజయం సాధించి ఎదిగితే వాళ్లకు దొరకనేమో అనే భయంతో వారు అలా అనుకొని ఉంటారని అన్నారు. ఇప్పుడు తాను చిన్న సినిమా ఈవెంట్లకు వెళుతున్నానని, ఒకవేళ తనకు భారీ సక్సెస్ వస్తే అలా రానేమో అని వాళ్ళకు భయం ఉండవచ్చని అన్నారు. వాళ్లు అసూయ వల్ల అలా అనుకుంటున్నారని, కానీ తాను మాత్రం అలా ఆలోచించడం లేదని పేర్కొన్నారు. తాను భారీ విజయం సాధిస్తే కథ చెప్పడానికి వెళితే పట్టించుకోనేమోనని భావిస్తున్నారని అన్నారు. సినిమా ఫెయిల్ అయితేనే తాను వారి వైపు చూస్తానని వారు అనుకుంటున్నట్లుగా ఉందని అన్నారు. ఎప్పుడూ స్టార్ డమ్ శాశ్వతమని తాను అనుకోనని మారుతి స్పష్టం చేశారు.

# ఫస్ట్ లుక్

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్ అనే భారీ యాక్షన్ మూవీ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇదొక కాపీ డ్రామా. ఇందులో ప్రభాస్ ఒక పోలీసాఫీసర్ గా కనిపించనున్నారు. ఆయనకు జోడీగా త్రిప్తి దిమ్రి హీరోయిన్ గా నటిస్తోంది. ఇటీవలే పూజా కార్యక్రమాలతో ఈ మూవీ ప్రారంభమైంది. ప్రభాస్ బర్త్ డే స్పెషల్ గా రిలీజ్ చేసిన 'స్పిరిట్ - వన్ బ్యాడ్ హ్యాబిట్' ప్రోమో ఆకట్టుకుంది. 2026 న్యూ ఇయర కానుకగా తాజాగా ఫస్ట్ పోస్టర్ ను విడుదల చేశారు. "ఇండియన్ సినిమా.... మీ అజానుబాహుడిని చూడు" అంటూ సందీప్ రెడ్డి వంగా 'స్పిరిట్' ఫస్ట్ పోస్టర్ ను సోషల్ మీడియాలో లాంచ్ చేశారు. ఇది వంగా మార్క్ ఫస్ట్ లుక్. ఇందులో ప్రభాస్ ఇంతకముందెన్నడూ చూడని సరికొత్త లుక్ లో సర్ప్రైజ్ చేశారు. లాంగ్ హెయిర్, గుబురు గడ్డంతో నల్ల కళ్లద్దాలు పెట్టుకొని రెబల్ గా కనిపిస్తున్నారు. నోట్లో సిగరెట్ పెట్టుకొని, ఒక చేతిలో మందు గ్లాస్ పట్టుకొని నిబడితే.. ఎదురుగ ఉన్న త్రిప్తి దిమ్రి లైటర్ వెలిగిస్తూ కనిపించింది. వైట్ ప్యాంటు వేసుకొని, షర్ట్ లేకుండా ప్రభాస్ బ్యాక్ సైడ్ లుక్ ని మాత్రమే చూపించారు. అతడి ఒంటి నిండా గాయాలు, గాయాలకు కట్టిన కట్లు చూస్తుంటే.. 'స్పిరిట్'లో ప్రభాస్ ఎంత వైల్డ్ గా ఉండబోతున్నారనేది తెలుస్తోంది. ఈ ఇంటెన్స్ పోస్టర్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది.

కచ్చితంగా 'యానిమల్'లో రణబీర్ కపూర్ పాత్రకు మించి ప్రభాస్ క్యారక్టర్ ఉంటుందని అభిమానులు భావిస్తున్నారు. ఇదే లుక్ తో బాక్సాఫీస్ ను తగలబెట్టబోతున్నారని కామెంట్స్ చేస్తున్నారు. 'స్పిరిట్' చిత్రాన్ని టి-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్లపై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.




బాలీవుడ్ సూపర్ స్టార్ హ ృతిక్ రోషన్ తన చేతికున్న అదనపు బొటనవేలు (డబుల్ థంబ్) గురించి తాజాగా ఓ ఆసక్తికరమైన, సరదా వ్యాఖ్య చేశారు. తన చేతులతో పరొక్షే 'హార్ట్ షేప్' (లవ్ సింబల్) ఎందుకు పెట్టలేకపోతున్నారో వివరిస్తూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. ఇది తనకు సంబంధించిన 'బిగ్ రెవలేషన్' (పెద్ద విషయం బయటపెట్టడం) అంటూ చమత్కరించారు.



2025 సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో హ ృతిక్ తన గర్ల్ ఫ్రెండ్ సబా ఆజాద్‌తో కలిసి ఉన్న ఫొటోలను షేర్ చేశారు. ఇందులో వారిద్దరి నీడలు మాత్రమే కనిపిస్తున్నాయి. ఈ సందరరేగా ఆయన రాస్తూ.. "హ్యాపీ షాడోస్ మాతో పాటు డ్యాన్స్ చేస్తున్నాయి. 2025 చాలా సంతోషంగా ముగుస్తోంది. నా అభిమానులందరికీ ప్రేమను పంచుతున్నా. రాబోయే కొత్త సంవత్సరాన్ని మీకే అంకితం చేస్తున్నా" అని పేర్కొన్నారు. ఇదే పోస్టులో చివరగా ఓ ఆసక్తికర విషయాన్ని ప్రస్తావించారు. "నా చేతులతో హార్ట్ సింబల్ సరిగ్గా పెట్టలేకపోవడం అనేది.. నాకు ఒకే చేతికి రెండు బొటనవేళ్లు (డబుల్ థంబ్) ఉండడం వల్ల నేను చేయలేని రెండో పని మాత్రమే" అంటూ ఫన్నీగా రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. కాగా, గత కొన్ని వారాలుగా హ ృతిక్ రోషన్ తన కజిన్ వివాహ వేడుకల్లో సందడి చేస్తున్నారు. సబా ఆజాద్, తన ఇద్దరు కుమారులు హ ృహాన్, హ ృదాన్‌లతో కలిసి ఆయన పెళ్లిలో పాల్గొన్నారు. అక్కడి సంగీత్ వేడుకలో తన కొడుకులతో కలిసి 'ఓ హెూ హెూ హెూ' పాటకు హ ృతిక్ వేసిన డ్యాన్స్ వీడియో విపరీతంగా ఆకట్టుకుంది. ఈ వీడియోను చూసిన హ ృతిక్ తల్లి పింకీ రోషన్.. తన కొడుకు, మనవళ్లు కలిసి డ్యాన్స్ చేయడం చూసి చాలా ఆనందంగా ఉందంటూ ఎమోషనల్ పోస్ట్ చేశారు. పిల్లలను సంస్కారవంతంగా పెంచారంటూ వారి తల్లి సుసాన్‌ను కూడా ఆమె ప్రశంసించారు.

Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.